Follow: @mahaadaily

26-12-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 2 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## తెలంగాణ ఐఏఎస్ అధికారుల జంబ్లింగ్

### 28 మంది అధికారులకు కొత్త బాధ్యతలు

జిల్లాల అదనపు కలెక్టర్లు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ల బదిలీ

మున్సిపల్ శాఖకు జయేష్ రంజన్.. టీజీపీఎస్సీకి హరిత

పాలనలో వేగం పెంచేలా సర్కార్ నిర్ణయం

కీలక పోస్టుల్లో కొత్త అధికారుల నియామకం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా 28 మంది ఐఏఎస్, నాన్‌కేడర్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థలోని అన్ని జోన్లకు కొత్త కమిషనర్లను నియమించడంతో పాటు, పలు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ఆ బాధ్యతల నుండి తప్పించారు.

మిగతా 2లో

టాప్ న్యూస్



**ఓటు వేస్తే కారు, బంగారం, థాయ్‌లాండ్ ట్రిప్!**

- పూణే ఎన్నికల్లో ఓటర్లకు హామీలు
- జనవరి 15న పుణే మున్సిపల్ ఎన్నికలు

02



**ఆయనకు 54.. నాకు 40.. నన్ను ఆంటీ అంటారా?**

- శివాజీని వదలని అనసూయ..

02



**బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బిగ్ షాక్**

- ఆమె పార్టీ పోటీ చేయకుండా నిషేదం

02

# వస్తా మీ వెనుక


## కాంగ్రెస్ వైపు.. ఇద్దరు కమలం ఎమ్మెల్యేల చూపు

పంచాయతీ ఎన్నికల్లో ఖంగుతిన్న ఇద్దరు.. పార్టీ మారకుంటే భవిష్యత్తు లేదని భావిస్తున్న ఆ ఇద్దరు

మీరు సంపాదించుకోరు.. మమ్మల్ని సంపాదించుకోనివ్వరా అంటూ అధికారులపై ఓ ఎమ్మెల్యే ఒత్తిడి

చేరికకు కాంగ్రెస్ పెద్దల నో.. అయినా నేను మీవాడినే అంటూ చక్కర్లు

ఎమ్మెల్యే తీరుతో విస్తుపోతున్న బిజెపి హైకమాండ్



**హైదరాబాద్ - మహా**

తెలంగాణలో బిజెపి ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో గెలవగా, ఓ ఎమ్మెల్యేను బిజెపి సస్పెండ్ చేసింది. అయినా ఆయన ఏ పార్టీలో చేరకుండా బిజెపి భావజాలానికి అనుగుణంగానే వ్యవహరిస్తున్నారు. ఇపుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల తీరు చూసి బిజెపి హైకమాండ్ కంగారు పడుతోంది. ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి వెళ్తే ఎలా ఉంటుందని తమ ఆంతరంగికులతో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం ముందు చతికిలపడ్డ ఇద్దరు ఎమ్మెల్యేలు.. ఇపుడు అధికారపార్టీ వైపు వస్తామని సంకేతాలిస్తూ కనపడిన నేతకల్లా మొక్కుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే అయితే ఆర్థికంగా బలపడవచ్చని భావించిన ఓ ఎమ్మెల్యే అడ్డదిడ్డ సంపాదనకు సర్కారు అవకాశమివ్వకపోవడంతో, కొందరు కీలక అధికారుల వద్దకు వెళ్ళి మీరు సంపాదించుకోరు.. మమ్మల్ని సంపాదించుకోనివ్వరా అంటూ తరచూ ఫోన్ల ద్వారా, ఆఫీసుల్లో కలిసి తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే కూడా ఇలా తమను ఒత్తిడి చేయలేదని, అధికారపార్టీ ఎమ్మెల్యేలు రూల్ పొజిషన్ చెబితే వింటారని.. కానీ ఈ ఎమ్మెల్యే తీరు భిన్నంగా ఉందని అధికారులు ప్రైవేట్ సంభాషణల్లో చెబుతున్నారు. గతంలో బిజెపిలో ప్రమోషన్ కావాలంటూ రకరకాల ప్రయత్నాలు చేసిన సదరు ఎమ్మెల్యే ఇటు కాంగ్రెస్ లోనూ మీ వాడినే అంటూ నిబంధనలకు విరుద్ధమైన పనులు చేయమంటూ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. గీత దాటిన ఆయన వ్యవహారంపై ఇటీవల బిజెపి హైకమాండ్ ముఖ్యులు కూడా క్లాస్ పీకినట్లు తెలిసింది. తనను కాంగ్రెస్ లో చేర్చుకోవాలని సదరు ఎమ్మెల్యే చేసిన అభ్యర్థనకు పార్టీ ముఖ్యులు నో చెప్పినట్లు తెలిసింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారం కాంగ్రెస్ కు ఇబ్బందికరంగా ఉండగా, బిజెపి నుండి ఎవరు వచ్చినా రాజీనామా చేసి రావాల్సిందేనని.. పార్టీ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సదరు ఎమ్మెల్యేకు ఓ కీలకనేత చెప్పినట్లు తెలిసింది. అయినా సదరు ఎమ్మెల్యే మాత్రం ఆశ చావక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరో ఎమ్మెల్యే గతంలో కాంగ్రెస్ లో పనిచేసి వెళ్ళగా, వచ్చే ఎన్నికలకు తన నియోజకవర్గంలో తనకు బిజెపి బాగుంటుందా.. కాంగ్రెస్ బాగుంటుందా అని తరచూ బేరీజు వేసుకుంటున్నట్లు తెలిసింది. మొత్తంగా కమలంలో కాంగ్రెస్ ప్రేమపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. జరుగుతున్న పరిణామాలన్నీ బిజెపి హైకమాండ్ ఎప్పటికపుడు తెలుసుకుంటోంది. ఈనెల 29 నుండి అసెంబ్లీ ప్రారంభం కానుండగా, బిజెపి ఎమ్మెల్యేల తీరు.. గ్రూపులపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి.

## జీ-మెయిల్ యూజర్ ఐడీ మార్చుకునే ఆప్షన్

### త్వరలో అందరికీ అందుబాటులోకి...

**మహా:** జీమెయిల్ వినియోగదారులకు ఇది శుభవార్త. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక ముఖ్యమైన ఫీచర్‌ను గూగుల్ అందుబాటులోకి తీసుకురానుంది. ఇకపై జీమెయిల్ ఐడీని మార్చుకునే అవకాశం కలగనుంది. పాత యూజర్ ఐడీతో సంతృప్తి చెందని వారికి ఇది ఒక గొప్ప అవకాశం. అయితే, ఈ ఆప్షన్ ఇంకా అందరికీ అందుబాటులోకి రాలేదు. కొందరికి మాత్రమే

మిగతా 2లో




## తెలంగాణలో యూరియా యాప్ ప్రభంజనం

- 1.15 లక్షల బస్తాల బుకింగ్‌తో సరికొత్త రికార్డు
- యూరియా యాప్ ద్వారా లబ్ధి పొందిన 20 వేల మంది రైతులు
- యూరియా యాప్‌కు అన్నదాతల నీరాజనం
- జిల్లాల వారీగా ఊపు అందుకున్న యూరియా ఆన్‌లైన్ బుకింగ్స్
- అగ్రస్థానంలో పెద్దపల్లి జిల్లా

02




## జీహెచ్ఎంసీలో జోన్లు, సర్కిళ్లు పెంపు

- **తుది నోటిఫికేషన్ విడుదల**
- **జోన్లు ఆరు నుంచి 12కు, సర్కిళ్లు 30 నుంచి 60కి పెంపు**
- **కొత్త జోన్‌లలో ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, గోల్కొండ, శంషాబాద్, రాజేంద్ర నగర్**

**హైదరాబాద్, మహా:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) డీలిమిటేషన్‌కు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదలైంది. జోన్లు, సర్కిళ్లు, డివిజన్ల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీలో జోన్లను 6 నుంచి 12కు, సర్కిళ్లను 30 నుంచి 60కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. డివిజన్ల సంఖ్యను 300కి పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేశారు. కొత్తగా ఏర్పాటవుతున్న జోన్లలో ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్ ఉన్నాయి. గత కొద్దిరోజులుగా రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల్లో వ్యక్తమైన నిరసనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా డివిజన్లు, సర్కిళ్లు, జోన్ల సంఖ్యను రెండింతలు చేశారు. డివిజన్ల విభజనపై ఆరు వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. వాటిని పరిశీలించిన అధికారులు సహేతుకమైన వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.

## సాగు చేస్తేనే డబ్బులు జమ

### రైతు భరోసా స్కీమ్‌లో కీలక మార్పులు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన

శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తించాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్, మహా :** పంట పెట్టుబడి సాయం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా స్కీమ్ పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి మరికొన్ని మార్పులు ఉండనున్నాయని తెలిపారు. గతంలో సాగు యోగత్య ఉన్నా భూములకు కూడా రైతు భరోసా స్కీమ్ కింద నిధులు జమ చేశారు. అయితే ఈసారి మాత్రం సాగు చేస్తున్న పంట భూములకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు. శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. శాటిలైట్ ఫొటోల క్రోడీకరణ పూర్తి చేసి నివేదికను వెంటనే సమర్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నివేదిక వచ్చిన తర్వాతనే రైతు భరోసా నిధులను విడుదల చేస్తామని చెప్పారు.


**సాగు లేకపోతే నిధులు కట్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట పెట్టుబడి సాయం స్కీమ్ లో అనేక మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఉన్న రైతుబంధు పేరును రైతు భరోసా స్కీమ్ గా మార్చింది. అన్ని రకాల భూములకు కాకుండా కేవలం సాగు యోగత్య ఉన్న భూములకే డబ్బులు చేయటం షురూ చేసింది. ఇప్పటికే ఓ సారి ఆయా రైతుల ఖాతాల్లో కూడా డబ్బులు వేసింది.

మిగతా 2లో

## అవినీతిలో రెవెన్యూశాఖే టాప్

- **ఏసీబీకి స్వేచ్ఛ.. దాడుల్లో చిక్కుతున్న లంచావతారాలు**
- **రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల అక్రమసంపాదన రికార్డు**
- **గత ఏడాదికంటే.. కేసులు అధికం**
- **2024లో 152.. 2025లో 220**
- **ఫిర్యాదుచేస్తే పరుగుపెడుతున్న ఏసీబీ**



**హైదరాబాద్ -మహా:**

అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపారు. రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు సీఎం స్వేచ్ఛనివ్వడంతో లంచావతారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దాడులు పెరగడంతో ప్రజల్లోనూ చైతన్యం పెరిగి, లంచావతారులపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఫలితంగా సామాన్యులను పీల్చిపిప్పిచేసే అధికారులకు అరదండాలు పడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికారుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది ఏసీబీ అధికారులు సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ, ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది.

మిగతా 2లో

## ఒడిశాలో మరో ఎన్‌కౌంటర్

### తెలంగాణకు చెందిన మావోయిస్టు కీలక నేత గణేశ్ హతం

**ఎన్ కౌంటర్ లో ఆరుగురు మృతి.. గణేష్ పై 1.1కోట్ల రివార్డు**

**ఎన్ కౌంటర్ పై అమిత్ షా ట్వీట్**



**భువనేశ్వర్, మహా :** మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. వరుస ఎన్ కౌంటర్లతో సతమతమవుతున్న పార్టీకి ఒడిషాలో జరిగిన తాజా ఎన్ కౌంటర్ మరింత దెబ్బతీసింది. ఒడిశాలో జరిగిన కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత గణేష్ ఉయికేతో పాటు మరో ఐదుగురు మృతి చెందారు. తెలంగాణలోని ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన గణేశ్ ఉయికే కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత గణేష్ ఉయికే ప్రాణాలు కోల్పోయాడు. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడుగా ఉన్న గణేశ్ ఉయికే కీలక నేతగా ఉన్నారు. ఆయన తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలానికి చెందిన వ్యక్తి.

మిగతా 2లో

## సివిల్ పంచాయితీలు చేస్తే వేటు తప్పదు

- స్టేషన్లు సెటిల్మెంట్ అడ్డాలు కావొద్దు
- గీత దాటితే ఐపీఎస్ అధికారి అయినా ఇంటికే!
- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోవద్దు
- పోలీసులకు డీజీపీ శివధర్ రెడ్డి తీవ్ర హెచ్చరిక



02

# ఓటు వేస్తే కారు, బంగారం, థాయ్‌లాండ్ ట్రిప్!

- పూణే ఎన్నికల్లో ఓటర్లకు హామీలు
- జనవరి 15న పుణే మున్సిపల్ ఎన్నికలు

**మహా:** పుణే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు ఇస్తున్న హామీలు మాత్రం ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. పుణే మున్సిపల్ ఎన్నికలకు మరో మూడు వారాల గడువు ఉండటంతో అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు పలువురు ఖరీదైన కానుకలు, ఉచితాలను ప్రకటిస్తున్నారు. కొందరు అభ్యర్థులు పట్టుచీరలు, బైక్‌లు, లగ్జరీ కార్లు, బంగారు ఆభరణాలు, విదేశీ ట్రిప్పులు వంటి ఆఫర్లు ఇస్తున్నారు. ఓట్ల కోసం లక్కీ డ్రాలు నిర్వహిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. పుణే మున్సిపల్ ఎన్నికలు జనవరి 15న జరగనున్నాయి. ఒక వార్డులో ఓ సీనియర్ నేత మహిళలను ఆకర్షించేందుకు కొన్ని గజాల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇందుకోసం లక్కీ డ్రా నిర్వహిస్తున్నారని సమాచారం. మరో అభ్యర్థి నూతన దంపతులకు థాయ్‌లాండ్ ట్రిప్పును ఆఫర్ చేస్తుండగా, మరికొన్ని వార్డుల్లో లక్కీ డ్రా పేరుతో బైక్‌లు, ఎస్‌యూవీలు, బంగారు ఆభరణాలు ఇస్తున్నారని తెలుస్తోంది. ఇంకొన్ని వార్డుల్లో కుట్టుమిషన్లు, సైకిళ్లు పంపిణీ చేసినట్లు సమాచారం.

# జీ-మెయిల్ యూజర్ ఐడీ మార్చుకునే ఆప్షన్

## త్వరలో అందరికీ అందుబాటులోకి....

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో అందరికీ అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టవచ్చు. మెయిల్ క్రియేట్ చేసే సమయంలో సరైన ఆలోచన లేకనో, నచ్చిన పేర్లు అందుబాటులో లేకనో చాలామంది ఏదో ఒక యూజర్ ఐడీతో మెయిల్ క్రియేట్ చేసుకుంటారు. ఆ తర్వాత ఐడీ మార్చుకోవడానికి అవకాశం లేకపోవడంతో చాలా సందర్భాలలో అదే ఈమెయిల్ ఐడీని కొనసాగించాల్సి వస్తుంది. పాత డేటాను కోల్పోవడం ఇష్టం లేనివారు కూడా అదే మెయిల్‌ను ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా, ఈమెయిల్ ఐడీని మార్చుకునే సౌలభ్యాన్ని గూగుల్ తీసుకువచ్చింది. గూగుల్ సపోర్ట్ పేజీలో ఈ ఆప్షన్ కనిపించింది. ఐడీ చివరలో జీమెయిల్.కామ్‌ను అలాగే కొనసాగిస్తూ యూజర్ నేమ్‌ను మార్చుకోవచ్చు. ఐడీ మార్చుకున్నప్పటికీ అది పాత ఖాతాగానే పరిగణించబడుతుంది. అయితే, ఒకసారి ఐడీ మార్చుకున్న తర్వాత ఏడాది వరకు మళ్లీ మార్చుకునే అవకాశం ఉండదు. అలాగే, ఒక ఐడీని గరిష్ఠంగా మూడుసార్లు మాత్రమే మార్చుకునే అవకాశం ఉంటుంది.

# ఒడిశాలో మరో ఎన్‌కౌంటర్

## తెలంగాణకు చెందిన మావోయిస్టు కీలక నేత గణేశ్ హతం

## ఎన్ కౌంటర్ లో ఆరుగురు మృతి.. గణేష్ పై 1.1కోట్ల రివార్డు

## ఎన్ కౌంటర్ పై అమిత్ షా ట్వీట్

(మొదటిపేజీ తరువాయి)

ఆయనపై రూ .1.1 కోట్ల రివార్డు ఉంది. ఒడిశాలో కేంద్రంగా కీలకమైన కార్యకలాపాలకు నాయకత్వం నేతగా గణేశ్ ఉయికేకు పేరుందని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

**అర్ధరాత్రి కూడా కాల్పులు**

బెల్ఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మ అడవిలో బుధవారం రాత్రి భద్రతా బలగాలతో కాల్పులు జరిగాయి. ఛత్తీస్ గఢ్ కు చెందిన ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. అయితే గురువారం ఉదయం చకపాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవిలో తాజాగా కాల్పులు జరిగాయి. ఇందులో ఉయికేతో సహా మరి కొందరు మావోయిస్టులు మరణించారని పోలీసులు చెప్పారు. ఈ కాల్పులు 69 ఏళ్ల గణేస్ ఉయికే (పాకా హన్మంతు) చనిపోయాడు. ఇతనికి రాజేష్ తివారీ, చామ్రు, రూపా అనే పేర్లు కూడా ఉన్నాయి. నల్గొండ జిల్లా చండూర్ మండలంలోని పుల్లెంల గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఈ కాల్పుల్లో చనిపోయిన మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ఒడిశాలో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిగిన అతి పెద్ద ఆపరేషన్లలో ఇది ఒకటని పోలీసులు చెబుతున్నారు. "ఆపరేషన్ లో పాల్గొన్న భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నాము. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని తాము బలంగా నిశ్చయించుకున్నాము" అని ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా. ఒడిశా పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ నకు చెందిన 20, సీఆర్పీఎఫ్ కు చెందిన ఇద్దరు, బీఎస్ఎఫ్ కు చెందిన ఒక బృందాలతో సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయని పేర్కొన్నారు. గురువారం వివిధ ప్రాంతాల్లో అనేక కాల్పులు జరిగాయి. ఆ తర్వాత మావోయిస్టులకు చెందిన నలుగురు మృతదేహాలు లభ్యమయ్యాయి. రెండు ఇన్సాస్ రైఫిల్స్, 303 రైఫిల్స్ ను కూడా భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

**ఒడిశా కంధమాల్ ఎన్‌కౌంటర్‌పై అమిత్ షా ట్వీట్**

ఒడిశా లోని కందహార్ లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. గురువారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ హతమైనట్లు ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యం ప్రకారం 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని మరోసారి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఒడిశా దాదాపు మావోయిస్టు రహిత రాష్ట్రమైందన్నారు.

# తెలంగాణలో యూరియా యాప్ ప్రభంజనం




- 1.15 లక్షల బస్తాల బుకింగ్‌తో సరికొత్త రికార్డు
- యూరియా యాప్ ద్వారా లబ్ధి పొందిన 20 వేల మంది రైతులు
- యూరియా యాప్‌కు అన్నదాతల నీరాజనం
- జిల్లాల వారీగా ఊపు అందుకున్న యూరియా ఆన్‌లైన్ బుకింగ్స్
- అగ్రస్థానంలో పెద్దపల్లి జిల్లా

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్ అనూహ్య విజయాన్ని నమోదు చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఎరువుల పంపిణీని క్రమబద్ధీకరించేందుకు, దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ డిజిటల్ విధానం ఆశించిన దానికంటే వేగంగా రైతుల చెంతకు చేరింది. అధికారిక గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 1,15,534 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ అయ్యాయి. సుమారు 19,695 మంది రైతులు ఈ సాంకేతికతను వినియోగించుకుని తమకు కావాల్సిన ఎరువులను ముందస్తుగా రిజర్వ్ చేసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నేతృత్వంలో ప్రారంభమైన ఈ ప్రయోగం, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ఒక ప్రధాన మార్పుగా పరిగణించబడుతోంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే, పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతుల స్పందన అద్భుతంగా ఉంది. పెద్దపల్లి జిల్లా 6,289 మంది రైతులతో బుకింగ్స్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీని వెంటే జనగామ జిల్లాలో 5,150 మంది రైతులు, మహబూబ్‌నగర్ జిల్లాలో 3,741 మంది, మరియు నల్గొండ జిల్లాలో 3,618 మంది రైతులు విజయవంతంగా యూరియాను బుక్ చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కూడా 897 మంది రైతులు ఈ యాప్ ద్వారా లబ్ధి పొందారు. కేవలం పట్టాదారులకే కాకుండా, కౌలు రైతుల సమస్యలను కూడా ప్రభుత్వం ఈ యాప్ ద్వారా పరిష్కరించింది. ఇప్పటివరకు 217 మంది కౌలు రైతులు 678 యూరియా బస్తాలను బుక్ చేసుకోవడం ఈ విధానం యొక్క పారదర్శకతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ యాప్ పనితీరులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు అక్రమాలకు తావులేకుండా చేస్తున్నాయి. రైతులు తమ ఆధార్ లేదా పాస్‌బుక్ వివరాలతో లాగిన్ అవ్వగానే, వారి భూమి విస్తీర్ణం, పండిస్తున్న పంట ఆధారంగా ఎన్ని బస్తాల ఎరువులు అవసరమో సాఫ్ట్‌వేర్ దానంతట అదే గుర్తిస్తుంది. బుకింగ్ పూర్తయిన 24 గంటల లోపు సంబంధిత డీలర్ వద్దకు వెళ్లి ఎరువులు తీసుకోవాల్సి ఉంటుంది, లేనిపక్షంలో ఆ బుకింగ్ రద్దై ఇతరులకు అవకాశం లభిస్తుంది. ఈ నిబంధన వల్ల ఎరువుల నిల్వలు అనవసరంగా బ్లాక్ కాకుండా, నిజమైన అవసరమున్న రైతులకే అందుతున్నాయి. పనులు వదులుకుని దుకాణాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, తమ ఫోన్ ద్వారానే నిమిషాల్లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కలగడంపై రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

# సివిల్ పంచాయితీలు చేస్తే వేటు తప్పదు

**స్టేషన్లు సెటిల్మెంట్ అడ్డాలు కావొద్దు**

- గీత దాటితే ఐపీఎస్ అధికారి అయినా ఇంటికే!
- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోవద్దు
- పోలీసులకు డీజీపీ శివధర్ రెడ్డి తీవ్ర హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర పోలీసు యంత్రాంగం తన విధి నిర్వహణలో అత్యంత పారదర్శకతతో వ్యవహరించాలని, ముఖ్యంగా సివిల్ వివాదాల విషయంలో గీత దాటకూడదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణను పక్కన పెట్టి, కుటుంబ సంబంధిత తగాదాలు, ఆస్తి పంపకాలు, భూ వివాదాల వంటి సివిల్ వ్యవహారాల్లో పోలీసులు తలదూర్చడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఒక అంతర్గత లేఖను విడుదల చేసిన ఆయన, నిబంధనలను అతిక్రమించి సెటిల్మెంట్లు చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. "గీత దాటితే వేటు తప్పదు" అనే సూక్తిని గుర్తు చేస్తూ, పోలీసు స్టేషన్లను పంచాయితీ అడ్డాలుగా మార్చి సివిల్ తగాదాలు సెటిల్ చేస్తే, హోంగార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని ఆయన తేల్చి చెప్పారు. సివిల్ వివాదాలు పూర్తిగా సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయని, ప్రతి పోలీసు అధికారికి ఈ ప్రాథమిక అంశంపై అవగాహన ఉండాలని డీజీపీ పేర్కొన్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల స్టేషన్లను సెటిల్మెంట్ సెంటర్లుగా మారుస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి ప్రవర్తన శాఖా పరంగా అత్యంత గంభీరమైన నేరమని స్పష్టం చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు, అవి సివిల్ స్వభావం కలిగి ఉంటే తక్షణమే వారిని సంబంధిత కోర్టులకు లేదా అధికారులకు మళ్లించాలే తప్ప, పోలీసులు మధ్యవర్తులుగా మారి పంచాయితీలు చేయడం సరికాదని లేఖలో వివరించారు. ప్రస్తుతం ఏవైనా వివాదాలను చట్టవిరుద్ధంగా పరిష్కరించినట్లు తేలితే, అటువంటి స్టేషన్ల బాధ్యులు మరియు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎస్పీలు, సీపీలకు కూడా మినహాయింపు ఉండదని హెచ్చరించారు. పోలీసు యూనిఫామ్ మరియు అవినీతి ఎప్పటికీ కలిసి ఉండకూడదని డీజీపీ శివధర్ రెడ్డి ఆకాంక్షించారు. సమాజంలో అక్రమాలు, నీతి లోపాలపై కేసులు నమోదు చేసి నిందితులను న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల ప్రవర్తన ఎప్పుడూ యూనిఫామ్‌కు గౌరవాన్ని, ప్రభుత్వానికి ప్రతిష్టను, సమాజంలో శాంతిని కల్పించే విధంగా ఉండాలని ఆయన కోరారు. చట్టబద్ధమైన పాలనను అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం శాఖా ప్రతిష్టను మంటగలిపితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని డీజీపీ శివధర్ రెడ్డి తన లేఖ ద్వారా స్పష్టమైన హెచ్చరికలు పంపారు.

# రవాణా సంస్థలో కొలువుల జాతర

- ట్రాఫిక్, మెకానికల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం
- డిగ్రీ, డిప్లొమా అర్హతతో ఆర్టీసీలో ఉద్యోగాలు
- డిసెంబర్ 30 నుంచి దరఖాస్తులు

**హైద్రాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి కీలక ప్రకటన విడుదల చేసింది. రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 198 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులను భర్తీ చేసేందుకు డిసెంబర్ 25న అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో 84 ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులు ఉండగా, 114 మెకానికల్ సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 27,080 నుంచి రూ. 81,400 వరకు వేతన శ్రేణి ఉంటుందని అధికారులు వెల్లడించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 30, 2025 ఉదయం 8 గంటల నుంచి జనవరి 20, 2026 సాయంత్రం 5 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ (www.tgprb.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నిర్ణీత రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. స్థానిక ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుము రూ. 400 కాగా, ఇతర అభ్యర్థులు రూ. 800 చెల్లించాలి. ఈ పోస్టులకు సంబంధించి విద్యార్హతలను మండలి స్పష్టంగా పేర్కొంది. ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రైనీ పోస్టుకు అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి జూలై 1, 2025 నాటికి ఏదైనా డిగ్రీ (పట్టా) ఉత్తీర్ణులై ఉండాలి. మెకానికల్ సూపర్ వైజర్ ట్రైనీ పోస్టుకు ఆటోమొబైల్ లేదా మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. బీఈ, బీటెక్ లేదా ఏఎంఐఈ పూర్తి చేసిన వారు కూడా ఈ మెకానికల్ పోస్టులకు అర్హులని ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు జూలై 1, 2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో 5 ఏళ్ల సడలింపు వర్తిస్తుంది. ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు 200 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఆబ్జెక్టివ్ విధానంలో ఇంగ్లీష్, తెలుగు మరియు ఉర్దూ భాషల్లో ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో అర్హత సాధించిన వారికి ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు 12 నెలల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది.

# తెలంగాణ ఐఏఎస్ అధికారుల జంబ్లింగ్

**28 మంది అధికారులకు కొత్త బాధ్యతలు**

- జిల్లాల అదనపు కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ల బదిలీ
- మున్సిపల్ శాఖకు జయేష్ రంజన్.. టీజీపీఎస్సీకి హరిత
- పాలనలో వేగం పెంచేలా సర్కార్ నిర్ణయం
- కీలక పోస్టుల్లో కొత్త అధికారుల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

జయేష్ రంజన్ పర్యాటక, క్రీడలు మరియు పురావస్తు శాఖల బాధ్యతలను కూడా అదనంగా కొనసాగిస్తారు. ఇక హైదరాబాద్ మున్సిపల్ యంత్రాంగంలో (జీహెచ్‌ఎంసీ) జోనల్ కమిషనర్లుగా భోర్ఖడే హేమంత్ సహదేవరావు (శేరిలింగంపల్లి), అపూర్వ్ చౌహాన్ (కూకట్‌పల్లి), సందీప్ కుమార్ ఝా (కుత్బుల్లాపూర్), ఎస్. శ్రీనివాస్ రెడ్డి (చార్మినార్), జి. ముకుంద రెడ్డి (గోల్కొండ) నియమితులయ్యారు. వీరితో పాటు ప్రియాంక అలా (ఖైరతాబాద్), అనురాగ్ జయంతి (రాజేంద్రనగర్), ఎన్. రవి కిరణ్ (సికింద్రాబాద్), కె. చంద్రకళ (శంషాబాద్), హేమంత కేశవ్ పాటిల్ (ఎల్బీ నగర్), సంచిత్ గంగ్వార్ (మల్కాజిగిరి) మరియు రాధిక గుప్తా (ఉప్పల్) బాధ్యతలు స్వీకరించనున్నారు. రాధిక గుప్తా మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ బాధ్యతలను కూడా కొనసాగిస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఎం. హరిత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అదే జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ పూర్తి స్థాయి కలెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఐటీ శాఖలో ఉన్న భావేష్ మిశ్రాను పరిశ్రమల శాఖ అదనపు సీఈఓగా నియమించగా, అక్కడ పనిచేస్తున్న ఈ.వి. నరసింహా రెడ్డి మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మలెంపాటి నారాయణపేట అదనపు కలెక్టర్‌గా వెళ్లనున్నారు. మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ఏ. నిర్మలా కాంతి వెస్లీకి ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు, దీనితో ఎం. దాన కిషోర్ ఆ బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫివుల్లాకు మైనారిటీ ఫైనాన్స్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. మరికొన్ని కీలక నియామకాల్లో, పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న జి. జితేందర్ రెడ్డి హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా, పి. కదిరవన్ హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమితులయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ జీఎంగా ఉన్న డి. హనుమంతు నాయక్ అదే సంస్థకు వీసీ అండ్ ఎండీగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. యాదాద్రి భువనగిరి అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, వికారాబాద్ అదనపు కలెక్టర్ జి. లింగ్యా నాయక్ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శిగా నియమితులయ్యారు.

# శంషాబాద్‌లో ఖాకీ ఇంటికే కన్నం

- అరుణాచలం వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!
- మధురానగర్ కాలనీలో దొంగల బీభత్సం
- పోలీస్ సిబ్బంది ఇంట్లో బంగారం, వెండి మాయం



**హైదరాబాద్, మహా:** రక్షకభటులకే రక్షణ లేకుండా పోయిందనే చందంగా హైదరాబాద్ శివార్లలోని శంషాబాద్‌లో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన పోలీసు శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి ఇంట్లోనే దొంగలు పడ్డారు. హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలో దొంగలు హద్దుమీరుతున్నారు. సామాన్యుల ఇళ్లే కాకుండా, ఏకంగా పోలీస్ సిబ్బంది నివాసాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. శంషాబాద్‌లోని మధురానగర్ కాలనీలో నివసిస్తున్న పోలీస్ ఉద్యోగి కృష్ణ గౌడ్ ఇంట్లో తాజాగా భారీ చోరీ జరిగింది. కృష్ణ గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం దర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు, అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు విరగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలను పగులగొట్టిన దుండగులు అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు పెద్ద మొత్తంలో నగదును దోచుకెళ్లారు. యాత్ర ముగించుకుని తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు, ఇంటి తలుపులు తెరిచి ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా సామాన్లన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటం, బీరువాలోని నగలు మాయమవడంతో వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలను సేకరించారు. దొంగతనం జరిగిన తీరును బట్టి చూస్తే, బాధితుల కదలికలపై నిఘా ఉంచిన ముఠానే ఈ పని చేసి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాలనీలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శంషాబాద్ వంటి రద్దీ ప్రాంతంలో, అది కూడా ఒక పోలీస్ ఉద్యోగి ఇంట్లోనే దొంగతనం జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవుల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని లేదా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ వాడాలని అధికారులు సూచిస్తున్నారు.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాకు బిగ్ షాక్

**ఆమె పార్టీ పోటీచేయకుండా నిషేధం**


**మహా:** బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ పై నిషేధం విధించింది యూనస్ సర్కార్. ఇప్పటికే షేక్ హసీనాపై అవినీతి కేసులు పెట్టి వాటిలో మరణ శిక్ష కూడా విధించేలా చేసింది ప్రభుత్వం. ఆమెకు అన్ని దారులు మూసుకుపోయేలా చేస్తోంది. సాధారణ ఎన్నికలు కనుక జరిగితే అవామీ లీగ్ ఘన విజయం సాధిస్తుందని, అదే జరిగితే షేక్ హసీనాపై కేసులన్నీ వీగిపోతాయి. ఇదే విషయాన్ని రీసెంట్ గా షేక్ హసీనా కూడా చెప్పారు. కానీ, ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా ఉండటానికే అవామీ లీగ్ పై ఎన్నికల్లో పోటీ చేయకుండా బ్యాన్ విధించినట్లుగా అర్థమవుతోంది. అలా ఆమెకు అన్ని దారులు మూసేసి భారత్ పై ఒత్తిడి పెంచేందుకే యూనస్ ఆధ్వర్యంలోని తాత్కాలిక ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

# సాగు చేస్తేనే డబ్బులు జమ

(మొదటిపేజీ తరువాయి)

అంతేకాకుండా వందల ఎకరాలు, రియల్ ఎస్టేట్ భూముల విషయంలోనూ జాగ్రత్తలు చేపట్టింది. తాజాగా సాగు చేస్తేనే డబ్బులు జమ చేయాలని నిర్ణయించింది. సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో. 10 లక్షల ఎకరాలలోపు భూములకు రైతు భరోసా స్కీమ్ నిధులు ఆగిపోతాయని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా అందిస్తోంది. గతంలో ఎకరానికి రూ.5 వేలు ఇచ్చేవారు.

రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఈ పథకం ద్వారా వేలాది ఎకరాలున్న రియల్ ఎస్టేట్, రాజకీయ నేతలు కూడా లబ్ధి పొందారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఇందులో బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రులు కూడా ఉన్నారని పేర్కొంది. 2023 ఎన్నికల సమయంలోనూ ఈ అంశంపై ప్రజల ముందు చర్చకు కూడా పెట్టింది కాంగ్రెస్ పార్టీ. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకం పేరును రైతు భరోసాగా మార్పు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా సాహు భూములకు మాత్రమే పథకాన్ని వర్తింప చేయాలన్న ఖచ్చితమైన నిర్ణయాన్ని రావడంతో తాజాగా శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా నిర్ధారించాలని, అసలైన లబ్ధిదారులు ఎక్కడా నష్టపోకుండా చూడాలని ఆదేశించింది.



# ఆయనకు 54.. నాకు 40.. నన్ను ఆంటీ అంటారా?

**శివాజీని వదలని అనసూయ..**

**మహా:** తన వయసును, వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేస్తూ వస్తున్న విమర్శలపై అనసూయ సోషల్ మీడియా వేదికగా ఘాటు కామెంట్స్ చేశారు. సమాజంలో అణచివేతకు గురవుతున్న ఒక వర్గం తరపున మాట్లాడటమే తన ఉద్దేశమని అనసూయ భరద్వాజ్ పేర్కొన్నారు. ప్రధాన సమస్యను వదిలేసి తనను 'ఆంటీ' అని పిలుస్తున్న వారిపై ఆమె సెటైర్లు వేశారు. "నాకు 40 ఏళ్లు.. ఆయనకు (శివాజీకి) 54 ఏళ్లు అనుకుంటా. మేమిద్దరం మా వృత్తి కోసం ఫిట్‌నెస్‌ను, గ్లామర్‌ను మెయింటైన్ చేస్తున్నాం. కానీ నన్ను ఆంటీ అంటున్న వారు ఆయన్ని మాత్రం 'గారు' అని పిలుస్తున్నారు. ఇందులో ఉన్న హిపోక్రసీ ఏంటో అర్థం కావడం లేదు" అని ఎద్దేవా చేశారు. చివరగా "ఆప్ జలన్ బర్కరార్ రఖ్నా.. హమ్ జల్వా బర్కరార్ రఖేంగే" (మీ కుళ్లును మీరు అలాగే ఉంచండి.. నా జల్వా నేను చూపిస్తూనే ఉంటాను) అంటూ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు.


# అవినీతిలో రెవెన్యూశాఖే టాప్

(మొదటిపేజీ తరువాయి)

70కు పైగా కేసులు అదనంగా నమోదయ్యాయి. ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. ఎప్పటిలాగే రెవెన్యూ శాఖ టాప్ కాగా, నీటిపారుదల శాఖ అధికారులు పెద్ద మొత్తాలతో చిక్కారు. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు, పోలీస్ స్టేషన్లలో సెటిల్ మెంట్ల కోసం వేధించిన పోలీసులు ఏసీబీ వలలో చిక్కారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ స్టేషన్ ల లోనే సీఐలు రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 17 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరి నుండి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసింది.

**ఏసీబీ దూకుడు**

అవినీతి రహిత తెలంగాణే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. దీంతో పోలీస్ శాఖ అక్రమార్కుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించేలా అనేక కీలక సంస్కరణలు చూపట్టింది. ఫిర్యాదులను స్వీకరించడానికి వాట్సాప్, టోల్ ఫ్రీ నంబర్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బాధితులు భయం లేకుండా ముందుకు వస్తున్నారు. లంచగొండి అధికారులను అరెస్ట్ చేయడమే కాకుండా.. వారిని సర్వీసు నుండి తొలగించేలా.. వారి ఆస్తులను జప్తు చేసేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు. ఏదైనా ప్రభుత్వ పని కోసం అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఇవ్వడం కూడా నేరమేనని.. అందుకే వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఏసీబీ చేపట్టిన మెరుపు దాడులతో ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఒక దశలో ఏసీబీ దాడుల తీరుపై.. కొందరు ఎమ్మెల్యేలు కూడా అసహనం వ్యక్తం చేశారు. అయితే ఏసీబీకి పూర్తి స్వేచ్ఛ ఉండడంతో దూసుకుపోతున్నారు.



# కర్ణాటకలో పెను విషాదం

## ట్రావెల్ బస్‌ను ఢీ కొట్టిన కంటెయినర్.. 17 మంది సజీవ దహనం

**బెంగళూరు, మహా :** క్రిస్మస్ పండుగ వేళ కర్ణాటక రాష్ట్రంలో అత్యంత విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. తెల్లవారు జామున ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండగా, మృత్యువు అగ్ని రూపంలో వచ్చి కబళించింది. చిత్రదుర్గ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. ఒక ప్రైవేటు బస్, కంటెయినర్ లారీ ఢీ కొనడంతో రేగిన మంటలు క్షణాల్లో విస్తరించి పెను విషాదాన్ని నింపాయి. సీబర్డ్ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు బెంగళూరు నుంచి గోకర్ణవైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గురువారం వేకువ జామున సుమారు 2.30 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. చిత్రదుర్గ జిల్లాలో జాతీయ రహదారి48పై గోర్లత్తు క్రాస్ వద్ద ఈ దారుణం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎదురుగా వస్తున్న ఒక కంటెయినర్ లారీ అదుపు తప్పి డివైడర్‌ను దాటి అవతలి వైపు వస్తున్న బస్సును బలంగా ఢీ కొట్టింది. ఢీ కొన్న వేగానికి రెండు వాహనాల్లోనూ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

**నిద్రలోనే మృత్యు ఒడిలోకి**

ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 32 మంది ప్రయాణికులు ఉన్నారు. మంటలు చాలా వేగంగా వ్యాపించడంతో, లోపల ఉన్నవారు ప్రాణాలు కాపాడుకోవడానికి బయటకు వచ్చే అవకాశం కూడా లేదు. దట్టమైన పొగ కారణంగా ఏవైపు వెళ్లాలో తెలియక 17 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకుపోయి ప్రాణాలు విడిచారు. అతి వేగం, ఆ సమయంలో ఉన్న పొగమంచు కారణంగానే ప్రమాదం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**ప్రాణాలు కాపాడుకున్నవారు**

ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ , కో డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలతో బయటపడ్డారు. మరికొందరు ప్రయాణికులు అద్దాలను పగులగొట్టి బయటకు రాగలిగారు. ఇలా బయట పడ్డ వాళ్లు తమ బంధువులు, స్నేహితులు కళ్ల ముందే అగ్నికి ఆహుతైపోతుంటే కన్నీరుమున్నీరుగా విలపించారు. గాయపడిన ఇతర ప్రయాణికులను అధికారులు తక్షణమే స్థానిక ఆసుపత్రులకు తరలించారు. మృతులను గుర్తించే ప్రక్రియను పోలీసులు చేపట్టారు. అధికారులు ప్రస్తుతానికి సేకరించిన సమాచారం ప్రకారం బస్‌లో మంజునాథ్, అమృత, కల్పన, సంధ్య, దిలీప్, శశాంక్, బిందు, కవిత, ప్రీతీశ్వరన్, అనిరుధ్ బెనర్జీ, ప్రజాపతి, విజయ్ భండారీ, శశికాంత్, నవ్య, కిరణ్‌పాల్, అభిషేక్, కీర్తన్ ఉన్నట్టు తెలుస్తోంది.



# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గురువారం యాదగిరిగుట్ట,యాదగిరిపల్లి, ఆత్మకూరు మండల కేంద్రంలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలేరు నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటున్నారని. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య క్రిస్టియన్ సోదర, సోదరీమణులందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి... చర్చీల్లో కేక్ కటింగ్ చేసి క్రైస్తవ సోదరి సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తంగల్లపల్లి రవి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ తదితరులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.



# రష్యాలో వీధులు శుభ్రం చేస్తున్న భారత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

- నెల సంపాదన 1.1 లక్షలు
- యంత్రాల సహాయం లేకుండా వీధులు శుభ్రం చేస్తున్నారంటున్న కంపెనీ హెడ్
- ఇలా పని చేస్తున్న వారిలో రైతులు కూడా ఉన్నారన్న త్యాబినా



**మహా :** బతుకు తెరువు కోసం రష్యా వెళ్లిన ఒక భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అక్కడ వీధులు ఊడ్చడం నెట్టింట వైరల్‌గా మారింది. వారసత్వ, కళా సాంస్కృతిక కట్టడాలకు పేరెన్నికగన్నది, ఆ దేశంలోనే రెండో అతి పెద్ద మహా నగరం కాగా ప్రపంచంలోని పెద్ద నగరాల్లో కోటగా ప్రఖ్యాతి పొందింది. సెయింట్ పీటర్స్‌బర్గ్ వంటి చారిత్రక నగరంలో భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వీధులను శుభ్రం చేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం సుమారు 17 మంది భారతీయులు ఉపాధి కోసం రష్యా దేశానికి చేరుకున్నారు. అందులో ఒక సాఫ్ట్‌వేర్ డెవలపర్ కూడా ఉన్నాడు. ఆ దేశంలో వీధులను శుభ్రం చేసే పనివారి కొరత ఉండటంతో ఇతర దేశాల నుంచి రప్పించుకుని వీధులు శుభ్రం చేయిస్తున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్ట్రీట్‌లో కొన్ని వారాలుగా ముఖేష్ మండల్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్లు, వీధులను చీపురు పట్టుకుని శుభ్రం చేస్తున్నారు. కొలోమైజస్కోయే కంపెనీ ద్వారా ముఖేష్ ఈ ఉద్యోగం పొందాడు. వసతి, భోజన సౌకర్యంతో పాటు ప్రతి నెలా రూ.1.1 లక్షలు (100,000 రూబెల్స్) వేతనం చెల్లిస్తుంది అక్కడి ప్రభుత్వం. ఇక్కడికి రాక ముందు సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా భారత్‌లో పనిచేశానని, ఇక్కడ మాత్రం రోడ్లు, వీధులు శుభ్రం చేస్తూ ఉపాధి పొందుతున్నట్లు ముఖేష్ మండల్ తెలిపారు. మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఏఐ, చాట్ బాట్, జీపీటీ వంటి విభాగాలలో ఉద్యోగం చేశానని ఆయన చెప్పాడు. ఉద్యోగం ద్వారా వచ్చే జీతాన్ని పొదుపు చేసుకునేందుకు రష్యా వచ్చినట్లు, పని చేయడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రోడ్లు క్లీనింగ్ చేసే పనిని ఎందుకు ఎంపిక చేసుకున్నావని ఒక మీడియా ప్రతినిధి అడగ్గా, నేను భారతీయుడిని, ఏ ఉద్యోగం అనేది తనకు సమస్య కాదని, పని దేవుడు ఇచ్చిన వరమని అన్నాడు. ఎక్కడైనా, ఏ పని అయినా చేస్తావా అని అడగ్గా, టాయ్ లెట్లు శుభ్రం చేసే పని కూడా చేస్తానని మండల్ సమర్థించుకున్నాడు. తన ఉద్యోగం, తన బాధ్యత అని, సాధ్యమైనంత వరకు పనిచేయడమే తన ముందున్న లక్ష్యం అన్నాడు. కొలోమైజస్కోయే కంపెనీ హెడ్ మరియా త్యాబినా మాట్లాడుతూ, భారత్ నుంచి వచ్చిన 17 మంది పనివారు యంత్రాల సాయం లేకుండా వీధులు, రోడ్లు శుభ్రం చేస్తున్నారని తెలిపారు.

# స్విగ్గీ, జొమాటోలపై తిరుగుబాటు

- బంద్ అయిన ఫుడ్ డెలివరీ
- పెట్రోల్ సెగకు తోడైన కంపెనీల దోపిడీ!
- వేతనాలు పెంచాలంటూ డెలివరీ బాయ్స్ భారీ ర్యాలీ

**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలో ఫుడ్ డెలివరీ వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలింది. గత కొన్ని రోజులుగా స్విగ్గీ, జొమాటో సంస్థల విధానాలపై రగులుతున్న ఆగ్రహం గురువారం పెను సమ్మెగా రూపుదాల్చింది. వేలాది మంది డెలివరీ భాగస్వాములు తమ విధులను బహిష్కరించి రోడ్ల మీదకు రావడంతో నగరంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్ల వద్ద ఆహారం పేరుకుపోయింది. కంపెనీలు అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలు, శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వకపోవడంపై ఈ నిరసన సెగలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పెట్రోల్ ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నా, సంస్థలు ఇచ్చే డెలివరీ ఛార్జీలు మాత్రం దశాబ్దం క్రితం నాటి స్థాయిలోనే ఉండటంపై కార్మికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనలో ప్రధానంగా వినిపిస్తున్న అంశం 'బేస్ పే' తగ్గింపు. గతంలో ఒక్కో ఆర్డర్‌కు లభించే కనీస ఆదాయాన్ని సంస్థలు క్రమంగా తగ్గిస్తూ రావడం, దానికి తోడు ఇన్సెంటివ్‌ల కోసం విధించే నిబంధనలు అసాధ్యంగా మారడం డెలివరీ బాయ్స్‌ను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. రోజుకు 12 గంటలకు పైగా కష్టపడినా, బైక్ ఈఎంఐలు, పెట్రోల్ ఖర్చులు పోను కనీసం ఇంటి అద్దె కట్టుకునేంత ఆదాయం కూడా రావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. గిగ్ ఎకానమీ పేరుతో సాగుతున్న ఈ నయా దోపిడీలో కార్మికులకు ఎలాంటి సామాజిక భద్రత లేకపోవడం గమనార్హం. విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగినా, ప్రాణాలు కోల్పోయినా కంపెనీల నుండి కనీస సాయం అందడం లేదని, భీమా సౌకర్యాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆందోళనకారులు ధ్వజమెత్తుతున్నారు. మరోవైపు, ఆర్డర్ల డెలివరీలో స్వల్ప జాప్యం జరిగినా కస్టమర్ రేటింగ్స్ ఆధారంగా ఐడీలను బ్లాక్ చేయడం వంటి చర్యలు వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. సాంకేతిక కారణాలతో యాప్‌లు సరిగా పనిచేయకపోయినా, దాని భారం డెలివరీ బాయ్స్ మీదనే పడుతోంది. నగరంలోని కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి, బంజారాహిల్స్ వంటి కీలక ప్రాంతాల్లో డెలివరీ బాయ్స్ భారీ బైక్ ర్యాలీలు నిర్వహించి తమ నిరసనను యాజమాన్యాలకు వినిపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, కనీస వేతనం మరియు పని గంటల నియంత్రణ ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సంస్థల మొండివైఖరి ఇలాగే కొనసాగితే ఈ సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ప్లాట్‌ఫారమ్ ఫీజుల పేరుతో కస్టమర్ల నుండి అదనంగా వసూలు చేస్తున్న కంపెనీలు, క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న డెలివరీ పార్ట్నర్లకు మాత్రం ఆ లాభాల్లో వాటా ఇవ్వకపోవడం శోచనీయం. ఈ నిరసనల కారణంగా వేలాది మంది నగరవాసులు ఆహారం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, హోటల్ పరిశ్రమ కూడా భారీ నష్టాలను చవిచూస్తోంది. యాజమాన్యాలు దిగివచ్చి చర్చలు జరిపితే తప్ప ఈ సంక్షోభం సద్దుమణిగేలా కనిపించడం లేదు.

# నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటా..


## గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెడతా.. సర్పంచ్ ఏర్పుల వెంకటేశం

**వలిగొండ, మహా :** గ్రామ అభివృద్ధి కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటానని గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని మండలంలోని వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం గురువారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ అన్నారు గ్రామ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో నెరవేరుస్తానని అన్నారు



# పేద విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసిన ఏలే చంద్రశేఖర్

**వలిగొండ, మహా :** మాజీ భారత ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్పేయి జయంతి సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో పేద విద్యార్థులకు ఉచిత సైకిళ్లను బిజెపి రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ పంపిణీ చేశారు వారు మాట్లాడుతూ వాజ్పేయి జయంతి సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషమని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను ఎదగాలని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోల్ల సుదర్శన్ మండల్ నాయకులు జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు



# హైదరాబాద్‌లో జశోదాబెన్ ఆధ్యాత్మిక పర్యటన

- నిరాడంబరంగా భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాల సందర్శన
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి సన్నిధిలో పూజలు



**హైదరాబాద్, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సతీమణి జశోదాబెన్ గురువారం హైదరాబాద్‌లో పర్యటించి పలు ప్రముఖ దేవాలయాలను సందర్శించారు. ఎటువంటి ఆర్భాటం లేకుండా అత్యంత నిరాడంబరంగా ఆమె ఈ పర్యటన సాగించారు. గురువారం ఉదయం నగరానికి చేరుకున్న ఆమె, నేరుగా పాత బస్తీలోని చారిత్రక చార్మినార్ చెంత కొలువై ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. లోకకల్యాణం కోసం, దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తాను ప్రార్థించినట్లు ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆమె సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. జశోదాబెన్ రాకతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆమెను చూసేందుకు స్థానికులు, పర్యాటకులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు. సాధారణ భక్తురాలిలాగే ఆలయ పరిసరాల్లో సంచరించడం, భక్తులతో చిరునవ్వుతో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. పర్యటన పొడవునా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. సాయంత్రం వరకు నగరంలోని మరికొన్ని ప్రాంతాలను సందర్శించిన ఆమె, తన ఆధ్యాత్మిక యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆమె వెంట కుటుంబ సభ్యులతో పాటు కొందరు సన్నిహితులు ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- నిందితులందరినీ మరోసారి విచారించిన సిట్ అధికారులు
- ముగిసిన ప్రభాకర్ రావు కస్టడీ



**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితులందరినీ సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్నలను పిలిచిన సిట్ వారిని విచారించారు. నేటితో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగియనుండటంతో అందిరితో కలిపి దర్యాప్తు చేస్తోంది సిట్. అందులోభాగంగా ఇప్పటికే సిట్ అధికారి రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సిట్ ఆఫీసుకు చేరుకున్నారు. నేటితో ప్రభాకర్ రావు 14 రోజుల విచారణ ముగియనుండగా ఉదయం 10 గంటలకు పోలీస్ కస్టడీ నుంచి విడుదల కానున్నారు. అయితే 14 రోజుల కస్టడీలో ప్రభాకర్‌రావు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానం చెప్పనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పెన్ డ్రైవ్‌ను సిట్ అధికారులు కీలక ఆధారంగా భావించారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన కాలంలో పెన్ డ్రైవ్‌లో ట్యాపింగ్ వివరాలు స్టోర్ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పెన్ డ్రైవ్ డేటాను ప్రభాకర్ రావు ముందు పెట్టి సిట్ విచారించింది. అయితే 6 వేల ఫోన్ నెంబర్లు ఉన్నప్పటికీ పెన్‌డ్రైవ్‌పై ప్రభాకర్ రావు ఎలాంటి జవాబు ఇచ్చారన్నది అస్పష్టంగా ఉంది. మరో వైపు ప్రభాకర్ రావు సమాచారం అధారంగా త్వరలోనే హరీష్ రావుతో పాటు మాజీ సీఎం కేసీఆర్ కు కూడా నోటీసులు ఇచ్చి విచారించేందుకు సిట్ సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

# అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన నియోజకవర్గ దళిత మోర్చా

**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ పట్టణంలోని మాజీ శాసనసభ్యుడు రాష్ట్ర బిజెపి జిల్లా నాయకుడు శానంపూడి సైదిరెడ్డి నివాసంలో అటల్ బిహారీ వాజపేయి 101 సంవత్సరాల జయంతి ఉత్సవాలు. జయంతి వేడుకలు హుజూర్ నగర్ నియోజకవర్గ దళిత మోర్చా అధ్యక్షుడు మేళ్లచెరువు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత అటల్ బిహారి వాజపేయి డిసెంబర్ 25 1924 సంవత్సరంలో బటేశ్వరి గ్రామంలో ఆగ్రా జిల్లా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జన్మించినాడు నేటికీ 101 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అటల్ బిహారి వాజపేయి జన్మదిన కార్యక్రమాన్నిపురస్కరించుకొని వాజపేయి జ్ఞాపకార్థాలను గుర్తు చేయడం జరిగినది.అటల్ బిహారీ వాజపేయి భారతీయ కవి రచయిత మరియు రాజనీతి శాస్త్రజ్ఞుడు భారత దేశ ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ సహాయ వ్యవస్థాపకులు ఒకరు భారతీయ పార్లమెంటు మరియు దాని దిగువసభలో అయినా లోక్ సభలో అయినా అత్యధిక ఎక్కువ కాలం పనిచేసిన ఘనత అటల్ బిహారీ వాజపేయి ది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కంటి నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి పట్టణ నాయకులు కొప్పెర సాయి, పిల్లి నగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# మండల పార్టీ అధ్యక్షుడికి ఘనసన్మానం

**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్ పహాడ్ గ్రామంలో పాలక వీడు మండల పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు కు మండలంలో విజయం సాధించిన సర్పంచులు ఉప సర్పంచులు సభ్యులు కలసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని, జాన్ పహాడ్ దర్గా ఉర్స్ ఉత్సవాలకు మంత్రి ఉత్తమ్ వచ్చినప్పుడు ఎంతో ఉత్సాహంగా స్వాగతం చెప్పే బాధ్యత అందరూ తీసుకోవాలని కల్మెట్ తండ గ్రామంలో మన ప్రభుత్వం ఉన్నప్పుడే రామాలయ నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేస్తానని అన్నారు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు ఎవరైతే ఉన్నారో ఆ కార్యకర్తలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి వారికి పథకాలు అందేలా చూడాలని రాబోయే ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. తనకు ఇంత గౌరవం ఇచ్చిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాని అన్నారు, కార్యక్రమంలో కోమటికుంట, చెర్వుతండా,జానపహాడ్,జానపహాడ్ దర్గా కల్మెట్ తండా, శూన్యపహాడ్ గ్రామాల సర్పంచ్ లు,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బానోత్ సైదా నాయక్ , మహిళా కాంగ్రెస్ జ్యోతి, బీసీ సెల్ నాగయ్య, శ్రీకాంత్, శేషు, ఎస్ కె బాలసైదా,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# ఈవీ రంగంలో మహిళా సాధికారతే లక్ష్యం

## కాలుష్య రహిత రాజధాని దిశగా రేఖా గుప్తా సర్కార్ కీలక అడుగులు

**ఢిల్లీ, మహా:** దేశ రాజధానిలో కాలుష్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు పర్యావరణ హిత రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఢిల్లీ ప్రభుత్వం 'ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2.0'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించింది. ముఖ్యమంత్రి రేఖా గుప్తా నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నూతన విధానం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు కళ్లు చెదిరే రీతిలో రాయితీలను ప్రకటించింది. ఈ పాలసీలో ప్రధానంగా మహిళా వాహనదారులకు పెద్దపీట వేశారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసే మహిళలకు ప్రభుత్వం ఏకంగా రూ. 30,000 వరకు నేరుగా సబ్సిడీని అందజేస్తోంది. సాధారణ కొనుగోలుదారులకు ఇచ్చే ప్రోత్సాహకాల కంటే ఇది అదనం కావడం విశేషం. మహిళలు సొంతంగా, సురక్షితంగా ప్రయాణించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. కేవలం ద్విచక్ర వాహనాలకే పరిమితం కాకుండా, ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలుదారులకు కూడా భారీ ఊరట లభించనుంది. కొత్త విధానం ప్రకారం ఎలక్ట్రిక్ కార్లపై బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు రాయితీ పొందవచ్చు. ప్రారంభంలో రిజిస్టర్ అయ్యే నిర్దిష్ట సంఖ్యలోని కార్లకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. దీనికి తోడు రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుండి పూర్తి మినహాయింపు లభించడం వల్ల మధ్యతరగతి ప్రజలకు కూడా ఎలక్ట్రిక్ కార్లు అందుబాటు ధరలోకి రానున్నాయి. పాత పెట్రోల్ లేదా డీజిల్ వాహనాలను వదిలించుకుని ఈవీలకు మారే వారిని ప్రోత్సహించడానికి 'స్క్రాపింగ్ ఇన్సెంటివ్'ను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పాత బండిని తుక్కు కింద అప్పగించి కొత్త ఎలక్ట్రిక్ వాహనం కొంటే అదనపు ఆర్థిక సహాయం నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతుంది. ఈ పాలసీలో మరో వినూత్న అంశం ఏమిటంటే 'రెట్రోఫిటింగ్' ఇన్సెంటివ్. అంటే తమ వద్ద ఉన్న పాత పెట్రోల్ లేదా డీజిల్ కారును ఎలక్ట్రిక్ వాహనంగా మార్చుకోవాలనుకునే వారికి ప్రభుత్వం రూ. 50,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇది దేశంలోనే మొదటిసారిగా అమలు చేస్తున్న విధానంగా నిలుస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నగరం పొడవునా ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరిస్తోంది. ముఖ్యంగా నివాస కాలనీల్లో మరియు కార్యాలయాల వద్ద ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు వేగవంతం చేశారు. ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రస్తుతం ఢిల్లీలో కాలుష్య స్థాయిలను తగ్గించడంలో ఈవీ పాలసీ 2.0 కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్వయంగా ఢిల్లీ మెట్రోలో మహిళా ప్రయాణికులతో ముచ్చటిస్తూ ఈ పథకం ప్రయోజనాలను వివరించడం పట్ల ప్రజల నుండి మంచి స్పందన వస్తోంది.



# లోకరక్షకుడు క్రీస్తూ జన్మదినమే క్రిస్మస్

- బేతెస్థ ఖాసీంపేటలో 100మంది వితంతులకు వృద్ధులకుపేద మహిళలకు చీరెలు పంపిణి
- బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా
- బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు




**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట పట్టణ కేంద్రం నందు 4వ వార్డు ఖాసీంపేట లో గురువారం బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్విట్స్ పంచి పెట్టినారు అనంతరం బిషప్ దుర్గం ప్రభాకర్ తల్లి తండ్రులు దుర్గం వెంకటయ్య మైసమ్మ చేతుల మీదుగా 100మంది వితంతులకు వృద్ధులకు,పేద మహిళలకు చీరెలు పంపిణిచేసినారు. బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ లోకరక్షకుడు క్రీస్తూ జన్మదినమే క్రిస్మస్ అనీ,పాపులను రక్షించుటకు క్రీస్తూ యేసు లోకమునకు వచ్చాడని సర్వ మానవులను దేవుడు ఒక్కడే అనీ క్రైస్తవుల విశ్వాసం అనీ అన్నారు. యేసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే అతి పెద్ద పండుగ అనీ అన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్చ్ బిషప్ యం.పి.హెచ్.హెచ్.మోజెస్, తీతు సుధాకర్, బాబు, కిరణ్, జానయ్య, వెంకన్న, యేసుపాదం, కళింగ రెడ్డి, సురేష్, రాజు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
26-12-2025
04
MAHAADAILY.COM

# రేవంతన్న వెన్నుదన్ను

# కార్యకర్తల ఆత్మ బంధువు

## రాష్ట్ర అభివృద్ధిలో కీలకం వేమన్న

ముఖ్యమంత్రి వెంట నడుస్తూ.. అడుగులో అడుగు వేస్తూ..

రాష్ట్ర అభివృద్ధిలో వేమన్న వెన్ను దన్ను..

17 ఏళ్లుగా సీఎం రేవంత్ రెడ్డితో ఆత్మీయ బంధం.

స్నేహానికి.. నమ్మకానికి.. ప్రతిభకు మంచి గుర్తింపు..

ప్రజా సేవకే జీవితం అంకితం.. తెలంగాణ నేపథ్యం ఉన్న కుటుంబం..

రజాకార్ల వ్యతిరేకంగా పోరాడిన నేత మనవడిగా గుర్తింపు..

విద్యార్థి నేతగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు..

మహబూబాబాద్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర..

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ప్రస్థానం.. నేడు జన్మదినం

### కేసముద్రం రూపురేఖలు మార్చుతున్న నేతగా పేరు

గతంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్న కేసముద్రం మండలం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. వేమన్న ఆశయంతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. దీంతో కేసముద్రం రూప రేఖలు మారిపోతున్నాయి. తమకు కొండంతా అండగా ఉంటూ కేసముద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న వేం నరేందర్ రెడ్డి కి ఇక్కడి ప్రాంత ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





**మహా, ప్రత్యేకం:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు ఆప్తుడు..17 ఏళ్లుగా వారి మధ్య ఆత్మీయ స్నేహ బంధం కొనసాగుతున్నది. సీఎం వెంట నడుస్తూ అడుగులో అడుగు వేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వం లో రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి ప్రవేశించి అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదర అభిమానాలు చురగొన్నారు. మొదటినుంచి తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్న ప్రముఖ కుటుంబం వారిది. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన నేత మనవడిగా గుర్తింపు సాధించారు. రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితుడు. అందరికీ ఆత్మ బంధువు.. ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు ముఖ్య నేతలందరి మనసెరిగిన నేత.. రాష్ట్రంలోనే ఆ నేత పేరు బ్రాండ్ అంబాసిడర్.. కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడంలో తన శక్తి యుక్తులను దార పోశారు. స్నేహానికి నమ్మకానికి మంచి ప్రతిభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు తగిన గుర్తింపునిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఒకవైపు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూనే మరోవైపు రాష్ట్ర అభివృద్ధిలో తన ముద్ర చాటుకుంటున్నారు. పేదలకు నిత్యం అండగా నిలుస్తారు. ఆపదలో ఆత్మీయులుగా మెదులుతారు. రాష్ట్రంలో ఎంత బిజీగా ఉంటున్నా తన మహబూబాబాద్ ప్రాంత ప్రజల సేవలో నిరంతరం నిమగ్నమవుతున్నారు. అభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా నిత్యం కృషి చేస్తున్నారు. ఇంత ప్రాచుర్యం ఉన్న నేత ఎవరు అని అనుకుంటున్నారా.. ఆయనే జనహృదయనేత ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. నేడు శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా మహా పత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం.

### వేం నరేందర్ రెడ్డి నేపథ్యం..

వేం నరేందర్ రెడ్డి 1960లో డిసెంబర్ 26వ తేదీన మహబూబాబాదు జిల్లా, కేసముద్రం మండలం, అర్పనపల్లి గ్రామంలో జన్మించారు. ఆయన వరంగల్ సి.కె.ఎం కాలేజీ నుండి బిఎ పూర్తి చేశాడు. గ్రాడ్యుయేషన్ చేస్తున్న కాలంలోనే సెక్రటరీగా విద్యార్థి సంఘ నేతగా పని చేశారు. కేసముద్రంలో రీక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేసి దాదాపు 15ఏళ్ల పాటు అనేక సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. చిన్నప్పట్నుంచి సామాజిక సేవా కార్యక్రమాలపై మక్కువ. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేవారు.1977 నుంచి జనతా పార్టీలో ఉంటూ పూర్తిస్థాయి రాజకీయాల్లో కొనసాగారు. 1983 తెలుగుదేశం ఆవిర్భావంతోనే టీడీపీలో చేరి, క్రమశిక్షణ గల కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. కాగా, 1999లో నరేందర్‌రెడ్డి మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నించారు. నరేందర్‌రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్మన్‌గా బరిలో నిలిచేందుకు నల్లబెల్లి నుంచి జడ్పీటీసీగా పోటీ చేశారు. కానీ పరిస్థితిని అనుకూలించక విజయం సాధించలేకపోయారు. అనూహ్య పరిణామాల్లో 2004 ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి టీడీపీ టికెట్‌తో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత మహబూబాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యభజనలో భాగంగా 2009లో ఎస్టీకి రిజర్వ్‌డ్ కావడంతో ఇక్కడ పోటీచేసే అవకాశం లేకుండా పోయింది .2010 ఉప ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2015లో ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేశారు.

### రేవంత్ రెడ్డితో కలిసి 2017లో కాంగ్రెస్ పార్టీలోకి..

కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో కీలకపాత్ర. అప్పటి వేం నరేందర్ రెడ్డి రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2017లో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 26 జూన్ 2021లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. 2023లో తెలంగాణ ఎన్నికల ప్రచార కమిటీ, ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి.. నరేందర్‌రెడ్డికి మధ్య సుమారు 17 సంవత్సరాల నుంచి ఆత్మీయ స్నేహబంధం కొనసాగుతోంది. టీడీపీలోనూ ఇద్దరు కలిసే పనిచేశారు. 2004 నుంచి 2009 మధ్యలో ఎమ్మెల్యేగా కొనసాగిన వేం నరేందర్‌రెడ్డికి 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రేవంత్‌రెడ్డితో పరిచయం ఆత్మీయబంధంగా మారింది. ఇదే స్నేహానికి నమ్మకానికి ప్రతీకగా నిలిచింది. నమ్మినవారికి తన ప్రాణం ఉన్నంతవరకు ఆత్మీయంగా వ్యవహరించే గుణం నరేందర్ రెడ్డి ది. 2009లో మహబూబాబాద్ ఎస్టీకి రిజర్వ్‌డ్ కావడంతో వేం నరేందర్‌రెడ్డి రాజకీయంగా అవకాశం కోల్పోయారు. ఆ తర్వాత నుంచి రేవంత్‌రెడ్డికి ఆప్తుడిగా వ్యవహరిస్తూ వస్తున్న నరేందర్‌రెడ్డి 20 23 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి హాజరైన ప్రతీ ప్రచార సభ నిర్వహణ బాధ్యతలు నరేందర్ రెడ్డి చూసేవారు. అంతేకాకుండా రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఆయన రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షించారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చడం.. అధికారంలోకి తీసుకురావడానికి తన శక్తి యుక్తులను ధార పోశారు. అధికారంలోకి రావడానికి తనదైన పాత్రను పోషించారు. ఆయన స్నేహానికి.. నమ్మకానికి.. ప్రతిభకు తగిన గుర్తింపునిస్తూ సీ ఎం ప్రోత్సహిస్తున్నారు. నరేందర్ రెడ్డి కష్టానికి ఫలితంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగానే కాకుండా, సీఎంకు కూడా సలహాదారుడిగా కొనసాగే క్యాబినెట్ హోదాను వేం నరేందర్‌రెడ్డి కల్పించడం రికార్డు అని చెప్పవచ్చు.

### మహబూబాబాద్ జిల్లా అభివృద్ధికి వేమన్న విశేష కృషి...

తనకు రాజకీయంగా జన్మనిచ్చిన మెహబూబాబాద్ జలభివృద్ధికి వేం నరేందర్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి ద్వారా విధులు మంజూరు చేయిస్తున్నారు. నిధులు మంజూరు చేయించడమే కాకుండా పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నారు. రోల్ మోడల్ గా నిలిచే ప్రాజెక్టులను సాధించి దమ్మున్న లీడర్ అని నిరూపిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా అనంతారం గ్రామంలో “మెగా ఫ్రైట్ మెయింటనెన్స్ డిపో” మంజూరు చేయించారు. అదేవిధంగా అనంతారం గ్రామంలో 409 ఎకరాలు దక్షణ మధ్య రైల్వేకి ప్రభుత్వం కేటాయించేలా ప్రత్యేకంగా నరేందర్ రెడ్డి కృషి చేశారు. తన కృషి ఫలితంగా మహబూబాబాద్ అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తున్నది.ఈ ప్రాంత ప్రజలకు ఎల్లవేళల అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. జిల్లాకు సంబంధించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కాకుండా ప్రజా ప్రతినిధులకు ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు ఏ అవసరం వచ్చినా ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీల ద్వారా తీరుస్తున్నారు. ఇంతటి సమర్థవంతమైన నేత ఉండడం ఆ జిల్లా ప్రజల అదృష్టంగా భావించవచ్చు. డైనమిక్ లీడర్ గా జనహృదయనేతగా ప్రజల ఆత్మబంధువుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు వేం నరేందర్ రెడ్డి.

### మొదటినుంచి తెలంగాణ ఉద్యమ నేపథ్యమే ఆయనది..

వేం నరేందర్‌రెడ్డి కుటుంబానికి మొదటినుంచి తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉంది. రజాకార్ల దురాగాతాలకు ఎదురొడ్డి పోరాడిన వేం పుల్లారెడ్డి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నరేందర్‌రెడ్డి ఆదినుంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నారు. ఆయన కుటుంబమంతా రాజకీయ నేపథ్యం ఉన్న వారే.. పూర్వ మహబూబాబాద్ పాతా తాలుకాలోని గూడూరు మండలం తీగలవేణి వాస్తవ్యులైన వేం పుల్లారెడ్డి నవాబుల కాలంలో రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నడిపిన యోధుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు ఆయన స్వస్థలం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని కేసముద్రం మండలం అర్పనపల్లిలో కూడా ఆస్తులు సంపాదించుకుని నలుగురి తలలో నాలుకలాగా వ్యవహరించేవారు ఆయన కుమారుడే వేం చెన్నకృష్ణారెడ్డి. ఈయన తన పదహారేళ్ల వయస్సులోనే రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించి, తీగలవేణి నుంచి అర్పనపల్లికి వచ్చి కొద్దికాలం పాటు రజాకార్ల నిర్బంధంతో అజ్ఞాతంలో గడిపారు. గ్రామ పెద్దగా వ్యవహరిస్తూ గూడూరు, కేసముద్రం, నెక్కొండ మండలాల్లోని దాదాపు 50 గ్రామాల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా.. తానే ఆదుకుంటూ ఉండేవారు ప్రజల మన్ననాలు పొందారు. అంతే కాకుండా నాయక్‌పల్లి, తీగలవేణి, అర్పనపల్లి గ్రామాలు కలిపి ఒకే గ్రామపంచాయతీ కింద ఉన్నప్పుడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై దాదాపు 20 సంవత్సరాల పాటు ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడి వ్యవసాయాన్ని నమ్ముకుని పనిచేసిన ఆయనకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడే వేం నరేందర్‌రెడ్డి. ఈయన (అన్న) సోదరుడైన వేం పురుషోత్తంరెడ్డి మొదట్నుంచి నరేందర్‌రెడ్డితో కలిసి రాజకీయాల్లో పనిచేశారు. ఇంతటి రాజకీయ చరిత్ర ఘనత ఉన్న కుటుంబం నుంచి వచ్చిన నరేందర్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం విశేషం. తెలంగాణ ఉద్యమ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన వారు కావడం మరో విశేషం.

## జిల్లాలో మంత్రి జూపల్లి రెండు రోజుల పర్యటన



**ఆదిలాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గాన స్థానిక పెన్ గంగా అతిథి గృహానికి చేరుకుంటారు.1030 కు రిమ్స్ లో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రారంభిస్తారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లాలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులకు జరిగే ఆత్మీయ సత్కార కార్యక్రమంలో పాల్గొంటారు,సాయంత్రం 5 గంటలకు తిరిగి పెన్ గంగా అతిథి గృహానికి చేరుకుని రాత్రి ఇక్కడే బస చేసి శనివారం ఉదయం నిర్మల్ బయలు దేరి వెళ్తారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణంతో పాటు , ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ , ముథోల్ నియోజక వర్గంలోని భైంసా పట్టణాల్లో పర్యటించి ఆయా నియోజకవర్గాలలో గెలుపొందిన సర్పంచ్ లను సన్మానిస్తారు.సాయంత్రం 5గంలకు భైంసా నుండి తిరిగి హైదరాబాద్ పయనమవుతారు.

## ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల, మహా :** ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. గురువారం జైపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారులు, అంతర్గత రహదారులు మురుగు కాలువల నిర్మాణం కొరకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. జైపూర్ మండలంలో బాబు జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణం కొరకు 25 లక్షల రూపాయలు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. షెడ్యూల్డ్ తెగల కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కూడ చర్యలు తీసుకుంటామని చెప్పారు. జైపూర్ మండలంలో మూసివేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోగల నర్సరీ తిరిగి ప్రారంభించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక అభివృద్ధికి అనేక అవకాశాలు కల్పించి మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అవసరం ఉన్న చోట 20 లక్షల రూపాయల వ్యయంతో ఇందిరా మహిళా భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణం లో జియోన్ ఎం.బి చర్చ్ మరియు జె.యల్.ఎమ్ చర్చ్ లలో క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ అనేది యేసు క్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేసుకునే పవిత్రమైన పండుగని ఇది ప్రేమ,శాంతి,దయ వంటి విలువలను మనకు తెలియజెస్తుందని అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలి అనే గొప్ప సందేశాన్ని క్రిస్మస్ అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,బిఎస్ సుధీర్,పాలమాకుల చెన్నయ్య,మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,నాయకులు సలీం,నర్సిమ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు బోల్తా

**తప్పిన భారీ ప్రమాదం.. జలవిహార కు వెళ్తుండగా ఘటన**



**షాద్ నగర్. మహా:** మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దయపల్లి చౌరస్తా సర్ఫ్ కంపెనీ ముందు కొద్ది సేపటి క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. నారాయణపేట జిల్లా మరికల్ కు చెందిన మణికంఠ ప్రైవేటు కళాశాల విద్యార్థులు హైదరాబాద్ జలవిహార్ కు వెళ్తుండగా.. ముందున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బస్సు బోల్తా పడింది ఈ ప్రమాదంలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. గాయపడ్డ విద్యార్థులను బాలనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**సంఘటనానికి చేరుకున్న మంత్రి వాకటి శ్రీహరి**

హైదరాబాదు నుండి వనపర్తి వైపు వెళ్తున్న మంత్రి వాకటి శ్రీహరి ప్రమాద స్థలం వద్ద ఆగి పరిస్థితిని సమీక్షించారు. భారీ క్రేను తీసుకువచ్చి స్కూల్ బస్సును పక్కకు తరలించారు. అనంతరం మంత్రి వనపర్తి బయలుదేరి వెళ్లిపోయారు. చచల సీఐ నాగార్జున, బాలనగర్ ఎస్సై లెనిన్, రాజాపూర్ ఎస్సై శివానంద ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

## ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయం



**ఆమనగల్లు, మహా :** ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, సర్పంచ్ గుర్రం కేశవులు అన్నారు. ఏసుప్రభు ప్రపంచానికి శాంతి సందేశం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంబీ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాల అతీతంగా పండుగలు జరుపుకోవాలని ఈ సందర్భంగా కేశవులు ఆకాంక్షించారు. పాస్టర్స్ బాలరాజ్, రాజు, మనోహర్, చర్చి అధ్యక్షులు పంతు నాయక్, కార్యదర్శి పురుషోత్తం లతో కలిసి క్రిస్మస్ కేక్ ను కేశవులు కట్ చేశారు. క్రిస్టియన్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల పండుగలను అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ల సహకారంతో ఆమనగల్లు పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్స్ క్రిస్మస్ సందర్భంగా కేశవులను సత్కరించారు. కార్యక్రమంలో సునీల్, సుభాష్, శ్రీను నాయక్ ఉన్నారు

## రాష్ట్ర స్థాయి క్రీడలకు బయలుదేరిన యాదాద్రి కబడ్డీ జట్లు



**ఆలేరు, మహా:** ఈనెల 25 నుండి జిల్లా 28వరకు కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియంలో జరుగు రాష్ట్ర సీనియర్ బాల బాలికల కబడ్డీ క్రీడా పోటీలలో పాల్గొనుటకు యాదాద్రి భువనగిరి జిల్లా బాలబాలికల జట్లు స్థానిక ఆలేరు బస్టాండ్ నుండి గురువారం బయలుదేరారు క్రీడాకారులను ప్రముఖ జర్నలిస్టుఎర్ర జాన్సన్,జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్యలు క్రీడాకారులకు వీడ్కోలు తెలిపారు. క్రీడాకారులకు కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బుర్ర మహేందర్ యాదవ్ దుస్తులు అందజేశారు ఈ కార్యక్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ ఫిజికల్ డైరెక్టర్ విజయ , రమేష్ రెడ్డి, క్రికెటర్ ఖాదర్ బాషా,సుభాష్ యూత్ ఆర్గనైజర్ పూల కళ్యాణ్, ఫ్రెండ్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, దళపతి,పారానంది రాహుల్ తేజ, ఈశ్వర్, సుభాష్ యూత్ చింతకాయల అనిల్, తేజ,వ్యాయామ ఉపాధ్యాయులు, సాత్విక, కోచ్ ఎస్ రాకేష్ , మరాటి లింగస్వామి, దారా కరుణాకర్, కానుగు రాము గౌడ్, జట్టు కెప్టెన్ పూల చంద్రకుమార్ పాల్గొన్నారు.

# ఏసు మార్గమే ప్రపంచ మార్గం


- **ఆయన ఆదర్శాలతోనే శాంతి.సమైక్యత**
- **ఆయన త్యాగాలే జగతికి రక్ష**
- **క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
- **ఎఫ్‌సీఎన్ ఫౌండేషన్ లో అనాథ వృద్ధుల మధ్య క్రిస్మస్ వేడుకలు**
- **పాల్గొన్న సంస్థ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు**
- **చర్చిలలోను ఘనంగా క్రిస్మస్ వేడుకలు**



**షాద్ నగర్, మహా** ప్రతి మనిషి తన ఆకలి తీర్చుకోవడమే కాదు.. తనకున్న శక్తితో పరుల ఆకలిని తీర్చాలి.. నిత్యం శాంతి మార్గంలో అడుగులు వేస్తూ ప్రపంచాన్ని తన వెంట నడిపించారు.. ఏసు మార్గమే జీవన మార్గమై ప్రతి ఒక్కరు ఆ మార్గంలో పునీతులు కావాలి.. యేసు త్యాగాలే నేటి సమాజానికి రక్షగా నిలిచాయి.. ఏసు క్రీస్తు అంటే అన్ని దైవాల సమూహం.. ప్రపంచాన్ని ఉన్నతి వైపు నడిపించే సన్మార్గం.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్రీస్తు యేసును కొనియాడారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడా పరిధిలోగల ఎఫ్సీ ఎన్ ఫౌండేషన్ లో గల అనాథ వృద్ధుల మధ్య క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిన ఆయన ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. అక్రమమార్గంలో నడుస్తున్న ప్రతి ఒక్కరిని సక్రమ మార్గంలో నడిపించి ప్రపంచానికి ఆయన అందించిన శాంతి సందేశం ఎప్పటికీ చిరస్మరణీయమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు క్రీస్తు మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే ప్రపంచశాంతికి బాటలు వేసిన మార్గం క్రీస్తు మార్గమేనని ఆయన వెల్లడించారు. ఎఫ్ సి ఎన్ ఫౌండేషన్ చైర్మన్ గీత థామస్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చెంది తిరుపతిరెడ్డి, బసవమ్మ, లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అశోక్, ఇబ్రహీం, మల్లేష్ యాదవ్, వీరేష్ గౌడ్, సీతారాం, తుపాకుల శేఖర్, అంజి యాదవ్, బుడ్డ నరసింహ, సుదర్శన్, శీను నాయక్, మహేందర్, శేఖర్, నరసింహ, శ్రీధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వైభవంగా క్రిస్మస్ వేడుకలు..**

షాద్ నగర్ పట్టణంలోని అన్ని చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ల ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు ప్రార్థనలను నిర్వహించారు. చిన్నారులు ఆధ్యాత్మిక గీతాలతో అలరించారు. మత పెద్దలు మాట్లాడుతూ యేసు క్రీస్తు జననమే ప్రపంచాన్ని సన్మార్గంలోకి తెచ్చేందుకు సృష్టించబడిందని అన్నారు. ఆ మార్గంలో నడిచిన ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా ప్రపంచం మొత్తం కీర్తించే దైవం ఏసుక్రీస్తు మాత్రమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రైస్తవులు పెద్ద ఎత్తున చర్చిలకు తరలి వెళ్లి ప్రార్థన కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు.



## శ్రుతిమించిన ఆకతాయిల ఆగడాలు

**కారు నుండి రాకెట్స్ ను పేల్చిన ఆకతాయిలు**

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ లోని అరాంఘర్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఆకతాయిల ఆగడాలు శ్రుతిమించిపోయాయి. బుధవారం అర్ధ రాత్రి అరంఘర్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై కదులుతున్న కారులో నుండి రాకెట్స్ షాట్స్ పేల్చిన ఆకతాయిలు. ఆ సమయంలో ట్రాఫిక్ లేకపోవడంతో విన్యాసాలు సాగాయి. రోజుకో విన్యాసాలు అరాంఘర్ పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వేపై జరుగుతున్నాయి. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆకతాయిలను కఠినంగా శిక్షించాలని వాహనదారులు కోరారు.

## ధ్యానం బతికున్నంత వరకు పత్రీజీ మనతోనే ఉంటారు

**జోరుగా కొనసాగుతున్న ధ్యాన మహా చక్రాలు.. ధ్యానులతో కళకళలాడిన పిరమిడ్**



**ఆమనగల్లు, మహా :** ధ్యానం బతికున్నంత వరకు ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ మనతోనే ఉంటారని పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్పల్లి గ్రామ సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్లో జరుగుతున్న మహిళ ధ్యాన మహా యాగాలు జోరుగా కొనసాగుతున్నాయి.మహేశ్వర పిరమిడ్ లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం 11 రోజుల వేడుకలు భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. క్రిస్మస్ సెలవు రోజు కావడంతో, ప్రపంచ నలుమూలల నుంచి ధ్యానులు హాజరై పత్రీజీ శక్తి స్థల్ వద్ద నివాళ్లర్పించారు. ఉ.5 గంటల నుంచి 8 వరకు నిర్వహిస్తున్న ప్రాతఃకాల ధ్యానానికి వేల మంది ధ్యానులు హాజరయ్యారు. పత్రీజీ శక్తి స్థల్ ప్రాజెక్టుకు ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు, కవులు, ఆధ్యాత్మిక వేత్తలను పిరమిడ్ నిర్వాహకులు సత్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఆధ్యాత్మిక గీతాలు, ధ్యాన గురువుల సందేశాలతో సంబరాలు అంబరాన్నంటాయి.ఈ కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రీ, ట్రస్ట్ సభ్యులు మాధవి, తదితరులు పాల్గొన్నారు



## సమస్త మానవాళికి రక్షకుడు ఏసు ప్రభువే

**ఆమనగల్లు, మహా :** సమస్త మానవాళికి రక్షకుడు ఏసు ప్రభువేనని పాస్టర్ సూచించారు . బుధవారం క్రిస్మస్ వేడుకలో భాగంగా ఆమనగల్లు ఫిలోదెల్ఫియా, ఎం.బి చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము 4గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. సామూహిక గీతాలపన నృత్యాలతో చిన్నారులు, యువతులు అలరించారు.ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ యేసు లోక రక్షకుడని మానవాళి పాపాలు హరించేందుకు యేసు జన్మించారన్నారు. ఆయనలో సహనగుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకుంటే శాంతి అలవడుతుందని పేర్కొన్నారు. అనంతరం కేకు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ సందడి చేసారు...ఈ వేడుకల్లో సంఘ సేవకులు పాపిశెట్టి రాము హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## క్రిస్మస్ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా :** క్రిస్మస్ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మిషన్ కాంపౌండ్ లోని బెతనీ ఎంబీ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్‌ను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ మాజీ సర్పంచ్



**ఆమనగల్లు, మహా:** అమనగల్లు మండలంలోని మెడిగడ్డ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాజీ సర్పంచ్ అంబర్ సింగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సమక్షంలో బీజేపీ నుండి 200 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడిగడ్డ గ్రామస్తులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో... ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా :** క్రిస్మస్ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఎలోహిమ్ గ్రేస్ గాస్పల్ చర్చిలో ,బెతనీ ఎంబీ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యేప్రకాష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్‌ను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. సమాజంలో శాంతి, ప్రేమ, కరుణ కలిగి ఉండాలి, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి

- **బాలయేసు క్షేత్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు**
- **క్రిస్టియన్ల కోసం తన వంతు సహకారం చేస్తా**
- **క్రిస్మస్ వేడుకల్లో హాజరవడం సంతోషం ఎమ్మెల్యే**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని, ఎమ్మెల్యే రంగారెడ్డి, క్రిస్టియన్ లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిహెచ్ఎంసి, తుర్కయాంజాల్ సర్కిల్ పరిధిలోని కమ్మగూడలో గల అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం (చర్చి)లో నిర్వాహకులు ఎంతో ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని, క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని, ఎమ్మెల్యే రంగారెడ్డి, క్రిస్టియన్ లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతమైన మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి బలమైనదని, కుల మతాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన గౌరవం లభిస్తుందని అన్నారు. క్రిస్టియన్ మిషనరీలు నిర్వహిస్తున్న పాఠశాలలు, ఆసుపత్రులు సమాజానికి అమూల్య సేవలు అందిస్తున్నాయని ప్రశంసించారు. విద్య వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను క్రిస్టియన్ మిషనరీలు అందిస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశం మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొంటూ, ఇందిరమ్మ రాజ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా ప్రభుత్వం బాధ్యతతో పని చేస్తోందని ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణ రెడ్డి, స్థానిక మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ కొత్తకుర్మ మంగమ్మ, మాజీ వైస్ ఎంపీపీ మల్ రెడ్డి యాదిరెడ్డి, మాజీకౌన్సిలర్లు, కోషిక ఐలయ్య, కాకుమాను సునీల్, నాయకులు కొత్తకుర్మ శివకుమార్, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, మేతరీ దర్శన్, రేవల్లి యాదగిరి, శేఖర్ గౌడ్, ముత్యాల రాజశేఖర్, సుబ్బరు పాండు, శ్యామల, వెంకట్ రావు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**మొయినాబాద్ మహా:** క్రిస్మమస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవ సోదర, సోదరీమణులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు భోదనలను చదివి వినిపించారు. అదే విధంగా పలు వేషధారణలతో ఏసు క్రీస్తు యొక్క జీవిత చరిత్రను వేదికలు ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఫాస్టర్లు ఏసుక్రీస్తు యె ఎక్క చరిత్రను చర్చిల్లో చదివి వినిపించారు. చర్చిల్లో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. చిన్న పెద్ద తేడాలేకుం డా ఎంతో సంతోషంగా క్రిస్మస్ పండుగను నిర్వహించుకున్నారు. క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.




**వివాహేతర సంబంధమే కవేలిగూడలో**

## యువకుడి హత్యకు కారణమా?

**పిలిపించి హత్య చేశారా ? అని కోణంలో పోలీసుల విచారణ**

**రాజేంద్రనగర్, మహా :** వివాహేతరా సంబంధమే హత్యకు కారణమై ఉండొచ్చని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కావేలిగూడలో యువకుడి హత్యకు దారి తీసిన ఘటనపై స్థానికులు తెలిపిన సమాచారం,,, మొయినాబాద్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మహేష్ అని యువకుడు ( 26) ఎయిర్ సెలూన్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు.గుర్తు తెలియని వ్యక్తులు మాట్లాడదం రమ్మని చెప్పి కవేలిగూడ సమీపనికి పిలిపించుకొని కత్తులతో దాడి చేసి హత్య చేశారు.వివాహేతర సంబంధం నేపథ్యంలోని మహేష్ హత్యకు గురయ్యాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. మర్డర్ కేసును శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి ఛాలెంజ్ గా తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.



## మైసూరు ప్యాలెస్ వద్ద విషాదం

**సిలిండర్ పేలి ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు**

**మైసూరు, మహా:**

మైసూరు రాజప్రసాదం (ప్యాలెస్) వద్ద గురువారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. క్రిస్మస్ సెలవుల సందర్భంగా పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో, ప్యాలెస్‌లోని జయమార్తాండ గేట్ సమీపంలో బెలూన్లలో గ్యాస్ నింపే సిలిండర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ భారీ పేలుడు ధాటికి బెలూన్ విక్రేత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు విక్రేత శరీరం ముక్కలై చెల్లాచెదురుగా పడిపోవడం అక్కడి వారిని భయాందోళనలకు గురిచేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న మైసూరు పోలీస్ కమిషనర్ సీమా లట్కర్ వివరాలను వెల్లడించారు. రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి సైకిల్‌పై బెలూన్లు విక్రయిస్తూ, వాటిలో గ్యాస్ నింపుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించామని, ప్రస్తుతం వారికి వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారని, ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నామని ఆమె వివరించారు. క్రిస్మస్ వేడుకల కోసం ప్యాలెస్ విద్యుత్ దీపాల అలంకరణను చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన పర్యాటకులు, ఈ పేలుడు శబ్దంతో బాంబు దాడి జరిగిందన్న భయంతో అటు ఇటు పరుగులు తీశారు. దీంతో ప్యాలెస్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్తత, గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీం ఘటనా స్థలిలో ఆధారాలను సేకరించాయి. పర్యాటక ప్రాంతాల్లో ఇటువంటి గ్యాస్ సిలిండర్ల వినియోగంపై ఉన్న నిబంధనల ఉల్లంఘనే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో మైసూర్ ప్యాలెస్ పర్యాటక సందడి ఒక్కసారిగా విషాదంగా మారింది.

# డబ్బు సంపాదన ధ్యేయంగా.. రోజుకు 14 గంటలు పని!

**వ్యాపారం చేసి రాణిద్దామనుకున్నాడు. ప్రారంభించిన నెలల వ్యవధిలోనే భారీగా నష్టపోయి, అప్పుల పాలయ్యాడు. ఎలాగైనా అప్పు తీర్చి.. మరోసారి వ్యాపారం చేయడానికి పెట్టుబడి సిద్ధం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో అడుగులు ముందుకు వేశాడు. కేవలం ఐదేళ్ల వ్యవధిలో కోటీశ్వరుడయ్యాడు. అప్పు తీర్చడమే కాకుండా.. కొత్త ఏడాదిలో కోటి రూపాయలతో రెండు టిఫిన్ సెంటర్లు కూడా ప్రారంభిస్తాడట. నిరాశతో కూరుకుపోయిన జీవితాన్ని స్వయంకృషితో ముందుకు సాగిన చైనాకు చెందిన పాతికేళ్ల కుర్రాడి గురించి అక్కడి మీడియాలో ప్రశంసలు వెలువెత్తుతున్నాయి. ఫుడ్‌డెలివరీ బాయ్‌గా కోట్లు ఎలా సంపాదించాడో గర్వంగా చెప్పకుంటున్నాడు. శ్రమ, పట్టుదల ఉంటే అసాధ్యమేదీ కాదని నిరూపించిన చైనా యువకుడు జాంగ్ జుకియాంగ్ గురించి తెలుసుకుందాం.**




### వ్యాపారంలో నష్టం

దక్షిణ చైనాలోని షాంఘై నగరానికి చెందిన పాతికేళ్ల 'జాంగ్ జుకియాంగ్' 2020లో ఓ వ్యాపారం ప్రారంభించాడు. ప్రారంభించిన కొన్ని నెలల వ్యవధిలోనే నష్టాల్లో కూరుకుపోయి వ్యాపారం మూసివేశాడు. నష్టంతో పాటు అప్పటికే అతనికి 50వేల యువాన్‌లు ఇక్కడి కరెన్సీ ప్రకారం. సుమారు ఆరున్నర లక్షలు అప్పు కూడా అయింది. సర్దుకున్న జాంగ్ నిరాశపడలేదు. ఎలాగోలా ముందుకెళ్లాలని నిర్ణయించుకుని షాంఘైలో ఓ పెద్ద ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లో చేరాడు. ఫుడ్ ఆర్డర్లను సరఫరా చేయసాగాడు. తోటి డెలివరీ బాయ్స్‌లా కాకుండా.. తనకంటూ ఓ లక్ష్యాన్ని పెట్టుకున్నాడు. నెలకు కనీసం ఇక్కడి కరెన్సీలో చూస్తే మూడు లక్షల రూపాయలు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.

### 365 రోజులు పని & రోజుకు 300 పార్శిళ్లు

ఏడాది మొత్తంలో 365 రోజులు పని చేయడం, రోజూ కేవలం విశ్రాంతి, తినడానికయ్యే సమయాన్ని మినహాయించి మిగతా సమయం అంతా ఫుడ్ డెలివరీ కోసం కేటాయించాడు. నిత్యం ఉదయం 11 గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు అంటే సుమారు 14 గంటలు ఫుడ్ డెలివరీ కోసం తిరిగాడు. రోజూ కనీసం 300 పార్శిళ్లను లక్ష్యంగా పెట్టకుని వాటిని కస్టమర్లకు అందజేశాడు. ప్రతిరోజు సుమారు 9 గంటల పాటు విశ్రాంతి తీసుకునే వాడు. చైనీస్ స్ప్రింగ్ ఫెస్టివల్ సెలవుల్లో కొన్ని రోజులు మాత్రమే సెలవు తీసుకుని మిగతా సమయాన్ని ఫుడ్ డెలివరీకి కేటాయించాడు. డబ్బు సంపాదన ధ్యేయంగా పని చేసిన జాంగ్ రోజూ 300 పార్శిళ్లు ఇవ్వడం... ప్రతి పార్శిల్‌కు అత్యధికంగా 20 నుంచి25 నిముషాలకు మించి సమయం తీసుకోకుండా త్వరితగతిన డెలివరీ చేయడంలోనూ ఫుడ్ డెలివరీ కంపెనీలో రికార్డు సృష్టించాడు. ఐదేళ్ల వ్యవధిలో జాంగ్ డెలివరీ కోసం 3లక్షల 24వేల కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు లక్షన్నరకు పైగా ఫుడ్ డెలివరీ పార్శిళ్లను అందజేశాడు. అతని అంకితభావాన్ని చూసి తోటి ఉద్యోగలు అతనికి ఆర్డర్ కింగ్ అని నామకరణం చేశారు. ఐదేళ్ల కాలంలో జాంగ్ మొత్తం కోటి 80లక్షలు సంపాదించి.. వాటిలో కోటి 42 లక్షలు పొదుపు చేయగలిగాడు. ఆ డబ్బుతో తిరిగి వ్యాపారం చేయడానికి సిద్ధమవుతన్నాడు.

# అమెజాన్ ఐఎక్స్‌డీ ప్రోగ్రాంలో నిహార్ ఇన్ఫో

సరఫరా వ్యవస్థను పటిష్టం చేసుకునే దిశగా అమెజాన్ ఇంటర్-స్టేట్ ఎక్స్‌ప్రెస్ డెలివరీ (ఐఎక్స్‌డీ) ప్రోగ్రాంలో చేరినట్లు ఈ-కామర్స్ సంస్థ నిహార్ ఇన్ఫో గ్లోబల్ ఎండీ దివ్యేష్ నిహార్ తెలిపారు. ఐఎక్స్‌డీ నిబంధనలకు అనుగుణంగా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లు పొందినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు కంపెనీ రెండు వేర్‌హౌస్‌లతో కార్యకలాపాలు సాగిస్తుండగా, ప్రోగ్రాంలో చేరడంతో సదరు రాష్ట్రాల్లోని 20కి పైగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ఉపయోగించుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. సమర్థవంతంగా నిల్వలను పాటించేందుకు, వ్యయాల భారాన్ని తగ్గించుకుని దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్, పంపిణీ సామర్థ్యాలను పెంచుకునేందుకు, వేగవంతంగా డెలివరీలు చేసేందుకు ఇది తోడ్పడుతుందని వివరించారు. కంపెనీ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు మొదలైనవి ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్‌లలో విక్రయిస్తోంది.



# ఈ బ్యాంకుకు 115 ఏళ్లు..




ప్రభుత్వ రంగ దిగ్గజం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ 115 వ్యవస్థాపక దినోత్సవాన్ని ముంబైలో జరుపుకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు పాల్గొన్నారు. తొలి స్వదేశీ బ్యాంక్ అయిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేశ బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేయడంలో, సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధనలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బ్యాంకు రుణాల్లో ఆర్ఏఎం (గ్రామీణ, వ్యవసాయ, చిన్న-మధ్య తరహా సంస్థలకు లోన్స్) వాటా 72 శాతంగా ఉండటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 4,556 శాఖలు, 21,492 టచ్ పాయింట్లతో విస్తృతంగా సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు ఎండీ కల్యాణ్ కుమార్ తెలిపారు. వ్యాపార పరిమాణం రూ. 7,37,938 కోట్లకు చేరినట్లు వివరించారు. భారతదేశంలో తొలి స్వదేశీ బ్యాంకుగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుగాంచింది. 1911లో పూర్తిగా భారతీయుల యాజమాన్యంలో, నిర్వహణలో స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడింది. సోరాబ్జీ పోచ్‌ఖానావాలా దీనిని స్థాపించారు.



# బజాజ్ పల్సర్ 150 బైక్.. కొత్తగా వచ్చేసింది!

ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తమ పాపులర్ పల్సర్ 150 బైక్‌ను మరింత ఆకర్షణీయంగా అప్ డేట్ చేసింది. దాని మెకానికల్ సెటప్‌లో ఎలాంటి మార్పులు లేకుండా చిన్నపాటి డిజైన్, ఫీచర్ మెరుగుదలలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా పల్సర్ 150 ఇప్పుడు ఎల్‌ఈడీ టర్న్ ఇండికేటర్లతో పాటు ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్‌తో వస్తోంది. కాగా బైక్‌లో ఇప్పుడున్న వేరియంట్‌లు అలాగే ఉంటాయి. బజాజ్ 2026 ద్వితీయార్థంలో పల్సర్ క్లాసిక్ శ్రేణిలో మార్పులు చేస్తుందని ఓవైపు ఊహాగానాలు నడుస్తుండగానే బజాజ్ ఆటో తన అత్యంత ఐకానిక్ మోటార్ సైకిళ్లలో ఒకటైన పల్సర్ 150ను రిఫ్రెష్ చేసింది. అప్‌డేటెడ్ పల్సర్ 150 శ్రేణి ధర రూ. 1.08 లక్షలు నుంచి ప్రారంభమవుతుంది. పల్సర్ 150 ఎస్‌డీ ధర రూ .1,08,772, పల్సర్ 150 ఎస్‌డీ యూజీ ధర రూ. 1,11,669లుగా ఉంది. ఇక టాప్‌స్పెక్ అయిన పల్సర్ 150 టీడీ యూజీ ధర రూ. 1,15,481.. సమకాలీన మోడల్ బైక్‌లతో పోటీపడేలా బజాజ్ పల్సర్ 150లో అప్ డేటెడ్ గ్రాఫిక్స్ తో డీటైల్స్‌ను కాస్త మెరుగుపరిచి కొత్త కలర్ ఆప్షన్లు తీసుకొచ్చింది. ఎల్‌ఈడీ టర్న్ ఇండికేటర్లతో పాటు ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్‌ను జోడించడం అత్యంత ముఖ్యమైన ఫంక్షనల్ అప్ గ్రేడ్. ఇది బైక్‌కు విజిబులిటీని పెంచడమే కాకుండా మొత్తం డిజైన్‌కే మోడ్రన్ టచ్ ఇస్తుంది. పల్సర్ 150 బైకులోని 149.5 సీసీ కెపాసిటి గల సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ ఇంజన్ గరిష్టంగా 8,500 ఆర్‌పీఎం వద్ద 13.8 బీహెచ్‌పీ పవర్, 6,500 ఆర్‌పీఎం వద్ద 13.25 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజన్ 5స్పీడ్ గేర్ బాక్స్‌తో జత చేయబడి ఉంటుంది. ఇక బ్రేకింగ్ హార్డ్ వేర్ విషయానికి వస్తే 260 మి.మీ ఫ్రంట్ డిస్క్, సింగిల్‌ఛానల్ ఏబీఎస్‌తో రియర్ డ్రమ్ సెటప్ ఉన్నాయి. కాగా సస్పెన్షన్ పనిని టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్‌లు, ట్విన్ గ్యాస్‌ఛార్జ్‌డ్ రియర్ షాక్ అబ్జార్బర్లు చూసుకుంటాయి.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# పొగమంచు దెబ్బ.. 60కి పైగా ఇండిగో విమానాలు రద్దు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కమ్ముకున్న దట్టమైన పొగమంచు, తక్కువ దృశ్యమానత కారణంగా దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోకు భారీ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. గురువారం ఒక్కరోజే వివిధ విమానాశ్రయాల నుండి ఏకంగా 67 విమానాలను ఇండిగో సంస్థ రద్దు చేసింది. బెంగళూరు, వారణాసి, అగర్తల, చండీగఢ్ తదితర నగరాల్లో వాతావరణం అనుకూలించకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. డిసెంబర్ 10 నుండి పొగమంచు కారణంగా ఇండిగో తరచూ అంతరాయాలను ఎదుర్కొంటోంది. పొగమంచు పరిస్థితుల్లో విమానాల ల్యాండింగ్ కోసం పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది. దీని ప్రకారం 50 మీటర్ల కంటే తక్కువ దృశ్యమానత ఉన్నప్పుడు కూడా ల్యాండ్ చేయగల అధునాతన విమానాలను, ప్రత్యేక శిక్షణ పొందిన పైలట్లను మాత్రమే విమానయాన సంస్థలు ఉపయోగించాలి. అయితే ఈ నిబంధనలను పాటించడంలో, వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో ఏర్పడిన వైఫల్యాలు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ఇండిగో కేవలం వాతావరణం వల్లే కాకుండా, అంతర్గత కార్యాచరణ లోపాలతోనూ సతమతమవుతోంది. ఇటీవల పైలట్ల విశ్రాంతి నిబంధనలు, సిబ్బంది కొరత కారణంగా తలెత్తిన గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఇండిగోపై కఠిన చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో సంస్థ శీతాకాలపు షెడ్యూల్‌ను 10 శాతం మేరకు కోత విధించి, రోజువారీ విమానాల సంఖ్యను 1,930కి పరిమితం చేసింది. డిసెంబర్ ఆరంభంలో ఒకే రోజు 1,600 విమానాలు రద్దు అయిన దరిమిలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వరుస వైఫల్యాల వెనుక ఉన్న మూల కారణాలను అన్వేషించేందుకు డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది, ఈ కమిటీ ఈ వారంలో తన నివేదికను సమర్పించనుంది. మరోవైపు, గంటల తరబడి విమానాశ్రయాల్లో వేచి చూస్తున్న ప్రయాణికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఐదు గంటలకు పైగా ఆలస్యమవుతున్న విమానాలు, సరైన సమాచారం లేకపోవడంపై సోషల్ మీడియా వేదికగా వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులతో ప్రయాణించే వారు తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాతావరణం అనే సాకు చెప్పకుండా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే పరిస్థితులు చక్కబడే వరకు ప్రయాణికులు తమ విమాన రాకపోకల స్థితిని తనిఖీ చేసుకుని బయలుదేరాలని ఇండిగో సూచించింది.




# ప్రళయం పోస్ట్‌పోన్.. యుగాంతం ఇప్పట్లో లేనట్లే!



ప్రళయాన్ని మానవమాత్రులైనా అంచనా వేయగలరా?.. అదేం సినిమానా? పోస్ట్‌పోన్ కావడానికి అనుకుంటున్నారా?. లక్షల మందిని మోసం చేసిన ఓ వ్యక్తి మాటల గురించే ఇక్కడ చెప్పబోతున్నాం. డిసెంబర్ 25వ తేదీన పెద్ద ప్రళయం పుట్టుకొస్తుందని.. దాని ప్రభావంతో యుగాంతం తప్పదని ప్రచారం చేసిన ఆ వ్యక్తి ఇప్పుడేమో మాట మార్చేశారు మరి!.. ఘనాకు చెందిన మత గురువు ఎబో(Eboh Noah) లెక్క తప్పింది. క్రిస్మస్ నాడే మహా జలప్రళయం మొదలు కాబోతోందని హెచ్చరికలు జారీ చేసిన ఇతగాడు.. ఇప్పుడు అబ్బే దేవుడు కొంతకాలం దానిని వాయిదా వేశాడంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. తనను తాను దైవ దూతగా ప్రకటించుకున్న నోహా.. ఈ ప్రళయం పేరు చెప్పుకునే లెక్కలేనంత విరాళాలు సేకరించడం ఈ ఎపిసోడ్‌లో కొసమెరుపు.

30ఏళ్ల ఎబో.. ఈ ఏడాది ఆగస్టులో ''జరిగేది.. జరగక మానదు'' అంటూ ఓ వీడియో పోస్ట్ చేశాడు. ఈ క్రిస్మస్ తేదీన ప్రపంచమంతా జోరు వాన మొదలవుతుందని.. అది మూడేళ్లపాటు ఆగకుండా కురిసి ప్రపంచం మునిగిపోతుందని, అయితే ఆ జల ప్రళయంలో మూడేళ్లపాటు తట్టుకోగలిగే పడవలను నిర్మించే బాధ్యత దేవుడు తనకు (నోహానని చెబుతూ) అప్పగించాడని అనుచరుల్ని నమ్మ బలికాడు.

ఆ అనుచరులు ఆ ప్రచారం విస్తృతంగా జరపడంతో.. ఎబోకి ఎబో జీసస్‌గా, ఎబో నోహాగా పేరు దక్కింది. ఈ మాటలు నమ్మిన లక్షల మంది తమ వద్ద ఉన్నవాటిని అమ్మేసి డబ్బులు ఇచ్చారు. తీరా.. ఆ తారీఖు వచ్చేసరికి.. ఆ యుగాంతం వాయిదా పడిందని చెబుతున్నాడు. దేవుడు మానవాళికి ఇంకొంత సమయం ఇచ్చాడని.. అలాగే మరింత మందిని రక్షించేలా ఆర్క్ ప్రాజెక్టు (భారీ పడవల నిర్మాణం) విస్తరించాలని ఆదేశించాడని చెబుతున్నాడు.

అయితే ఎబో డూమ్స్‌డే హెచ్చరికలపై పలువురు మండిపడుతున్నారు. బైబిల్ ప్రకారం.. ప్రళయం ఏనాడో వచ్చిందని, మరొకటి వచ్చే ప్రసక్తే లేదని.. మత విశ్వాసాలను అడ్డుపెట్టుకుని జనాలను మోసం చేయడం సరికాదని ఎబోకు హితవు పలుకుతున్నారు. ఇంకోవైపు.. జనాల నుంచి సేకరించిన సొమ్ముతో ఎబో విలాసాలు అనుభవిస్తున్నాడంటూ పలువురు మండిపడుతున్నారు.

# టీచర్‌పై తూటాల వర్షం.. వర్శిటీలో దారుణం

**అలీఘర్:** ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) క్యాంపస్‌లో రక్తం చిందింది. యూనివర్సిటీ పరిధిలోని ఏబీకే హైస్కూల్‌లో కంప్యూటర్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న రావు డానిష్ అలీ (డానిష్ రావు)ని గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. రాత్రి 9 గంటల సమయంలో మౌలానా ఆజాద్ లైబ్రరీ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డానిష్ అలీ తన ఇద్దరు సహోద్యోగులతో కలిసి వాకిగ్‌కు వెళుతూ లైబ్రరీ క్యాంటీన్ సమీపానికి చేరుకోగానే, స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు వారిని అడ్డుకున్నారు. వారిలో ఒకరు డానిష్ అలీని ఉద్దేశించి, 'నీకు నేను ఎవరో తెలియదు, ఇప్పుడు నువ్వు నన్ను గుర్తుపడతావు' అంటూ అతని తలపై పిస్టల్‌తో కాల్పులు జరిపాడు. అలీ అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. దుండగులు అక్కడి నుండి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన అలీని వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీకి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్ఎస్‌పీ)నీరజ్ జాదోన్ ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, పాత కక్షల కారణంగానే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



# మహనీయుల భారీ స్మృతి చిహ్నం.. ప్రారంభించిన ప్రధాని మోదీ

**లక్నో:** భారత రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా నేడు (గురువారం) దేశానికి ఒక అద్భుతమైన కానుక లభించింది. యూపీలోని లక్నో నగరంలో సుమారు 65 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో, రూ. 230 కోట్ల వ్యయంతో నిర్మించిన 'రాష్ట్రీయ ప్రేరణా స్థల్'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ స్మారక చిహ్నంలో ప్రధాన ఆకర్షణ.. ఆకాశాన్ని తాకేలా నిలుచున్న మూడు భారీ కాంస్య విగ్రహాలు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిల 65 అడుగుల విగ్రహాలు ఇక్కడ కొలువుదీరాయి. ఈ విగ్రహాలు భారతదేశ రాజకీయ విలువలకు, నిస్వార్థ ప్రజా సేవకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తూ, సందర్శకులలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయి. సుమారు 98 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, అత్యంత కళాత్మకంగా కమలం ఆకారంలో ఈ మ్యూజియాన్ని రూపొందించారు. ఇందులో అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీ సాంకేతికతను ఉపయోగించారు. తద్వారా ఈ నాయకుల జీవిత ప్రయాణాన్ని, వారు దేశం కోసం చేసిన పోరాటాలను సందర్శకులు కళ్లకు కట్టినట్లు చూడవచ్చు. ఇది కేవలం స్మారక చిహ్నంగానే కాకుండా ఒక గొప్ప విద్యా కేంద్రంగా కూడా రూపొందింది.



# ఛాంపియన్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

**నిర్మాలా కాన్వెంట్ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా..పెళ్లి సందడి మూవీతో హీరోగా మారాడు. తొలి సినిమాతోనే నటుడిగా మంచి మార్కులు సంపాదించుకున్నా.. బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. దీంతో కాస్త గ్యాప్ తీసుకొని పీరియాడికల్ ఫిల్మ్ 'ఛాంపియన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలకు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. దానికి తోడు ప్రమోషన్స్ కూడా గట్టిగా చేయడంతో 'ఛాంపియన్'పై హైప్ క్రియేట్ అయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? రోషన్ ఖాతాలో హిట్ పడిందా? లేదా? రివ్యూలో చూద్దాం.**




### కథేంటంటే..

ఈ సినిమా కథంతా 174748 ప్రాంతంలో జరుగుతుంది. సికింద్రాబాద్‌లోని ఒక బేకరీలో పని చేసే మైఖేల్ (రోషన్)కి ఫుట్‌బాల్ ఆట అంటే చాలా ఇష్టం. ఈ ఆటతోనే ఎప్పటికైనా ఇంగ్లాండ్ వెళ్లి..అక్కడే సెటిల్ అవ్వాలనుకుంటాడు. ఓసారి ఇంగ్లాండ్ వెళ్లే అవకాశం వస్తుంది. కానీ అతని తండ్రి చేసిన ఓ పని వల్ల వెళ్లలేకపోతాడు. దొంగమార్గాన ఇంగ్లాండ్ వెళ్లాలనుకుంటాడు. దాని కోసం కొన్ని తుపాకులను ఒక చోటుకి తరలించాల్సి వస్తుంది. ఆ పని చేసే క్రమంలో పోలీసుల కంటపడతారు. వారి నుంచి తప్పించుకొని అనుకోకుండా బైరాన్‌పల్లి అనే గ్రామానికి వస్తాడు. అదే ఊరికి చెందిన చంద్రకళ (అనస్వర రాజన్)తో పరిచయం.. నిజాం పాలకులకు వ్యతిరేకంగా ఆ ఊరి ప్రజలు చేసిన తిరుగుబాటు రోషన్‌లో ఎలాంటి మార్పులు తీసుకొచ్చింది? పోలీసు అధికారి బాబు దేశ్‌ముఖ్ (సంతోష్‌ప్రతాప్)తో మైఖేల్ గొడవ ఏంటి? బైరాన్‌పల్లి ప్రజల కోసం మైఖేల్ చేసిన త్యాగమేంటి? అనేదే మిగతా కథ.

### ఎలా ఉందంటే..

ప్రపంచంలోని పోరాటాల్లో తెలంగాణ సాయుధ పోరాటానికి చాలా ప్రత్యేకత ఉంది. అందులో బైరాన్‌పల్లి గ్రామస్తులు చేసిన పోరాటం మరింత ప్రత్యేకం. ప్రాణాలు పోతాయని తెలిసినా.. నిజాం పాలకులపై ఎదురుదాడి దిగారు. ఒకనొక దశలో రజాకార్లకే ముచ్చమటలు పట్టించారు. ఆ ఊరి ప్రజలు సాగించిన వీరోచిత పోరాటాన్నే 'ఛాంపియన్'లో మరోసారి చూపించారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో ఇప్పటికే పలు చిత్రాలు వచ్చినప్పటికీ.. ఓ ఆటగాడి కోణంలో సాయుధ పోరాటాన్ని చూపించడం.. అందులోనూ ఓ స్వచ్ఛమైన ప్రేమ కథను చెప్పడం 'ఛాంపియన్' స్పెషల్. అది తప్పితే ఈ సినిమా కథంతా రొటీన్‌గానే సాగుతుంది. పైగా చాలా చోట్ల సాగదీతగా అనిపిస్తుంది. ఆపరేషన్ పోలోకి దారి తీసిన సన్నివేశాలతో సినిమా ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత రజాకార్ల అరచకాలు.. బైరాన్‌పల్లి ప్రజల పోరాటాన్ని చూపించి.. కథను సికింద్రాబాద్‌కి మార్చాడు. అక్కడ ఆంగ్లో ఇండియన్ కుర్రాడిగా హీరో పరిచయం.. ఫుట్‌బాల్ టోర్నమెంట్, కోవై సరళ, వెన్నెల కిశోర్ సన్నివేశాలన్నీ కాస్త ఆసక్తికరంగా ఉన్నప్పటికీ.. కథ అక్కడక్కడే తిరుగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. హీరో ఎప్పుడైతే బైరాన్ పల్లి గ్రామానికి వస్తాడో.. అప్పటి నుంచి అసలు కథ ప్రారంభం అవుతుంది. హీరోయిన్‌తో పరిచయం.. నాటక ప్రదర్శన.. 'గిర్రా గిర్రా.. పాట ఇవన్నీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతాయి. బైరాన్‌పల్లిపై రజాకార్ల దాడి జరగడం.. హీరో ఊరి పోరాటంలో భాగమవ్వడం.. అవ్వడంతో సెకండాఫ్‌పై మరింత ఆసక్తి పెరుగుతుంది. అయితే ద్వితియార్థంలోనూ డ్రామాపైనే దర్శకుడు ఎక్కువ ఫోకస్ చేశాడు. కథనాన్ని పరుగులు పెట్టించే అవకాశం ఉన్నా.. దర్శకుడు ఆ దిశగా ఆలోచన చేయలేదు. ఎమోషనల్ సన్నివేశాలనే హైలెట్ చేశాడు. కానీ అవి పూర్తిగా వర్కౌట్ కాలేదు. ప్రేమ కథ ఒకవైపు.. సాయుధ పోరాటం మరోవైపు.. ఈ రెండిటిలో దేనికి ప్రేక్షకుడు పూర్తిగా కనెక్ట్ కాలేదు. రజాకార్లలో అసలు పోరాటం మొదలైనప్పటి నుంచి క్లైమాక్స్ వరకు కథనం ఆసక్తికరంగా సాగుతుంది. ముఖ్యంగా హీరో తండ్రి నేపథ్యం.. ఆయన చెప్పే మాటలు ఆలోచింపజేస్తాయి. హీరో తండ్రి పాత్రలో ఓ స్టార్ హీరో కనిపించడం ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. భావేద్వేగానికి గురి చేసేలా క్లైమాక్స్ ఉంటుంది.

### ఎవరెలా చేశారంటే..

మైఖేల్ సి విలియమ్స్ పాత్రలో రోషన్ ఒదిగిపోయాడు. తెలంగాణ యాసలో డైలాగ్స్‌ని అదరగొట్టేశాడు. డ్యాన్స్ కూడా ఇరగదీవాడు. యాక్షన్ సన్నివేశాల కోసం ఆయన పడిన కష్టం తెరపై కనిపించింది. తాళ్లపూడి చంద్రకళగా అనస్వర తనదైన నటనతో ఆకట్టుకుంది. తెరపై అచ్చమైన తెలుగమ్మాయిలా కనిపించింది. రాజిరెడ్డి పాత్రకు నందమూరి కల్యాణ్ చక్రవర్తి అంతగా సెట్ అవ్వలేదు. తెలంగాణ యాసను పలకడంలో ఆయన తడబడ్డాడు. పాత్ర సుందరయ్యగా మురళీశర్మ ఆకట్టుకుంటారు. రచ్చరవి, మురళీధర్ గౌడ్, బలగం సంజయ్, అర్చనతో పాటు మిగిలిన నటీనటులంతా తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. సాంకేతికంగా సినిమా బాగుంది. మిక్కీ జే మేయర్ సంగీతం, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలం. తోటతరణి ఆర్ట్ వర్క్ బాగుంది. సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. ఎడిటర్ తన కత్తెరకు ఇంకాస్త పని చెప్పాల్సింది. ఫస్టాఫ్‌లో కొన్ని సీన్లను మరింత క్రిస్పీగా కట్ చేసి నిడివి తగ్గిస్తే బాగుండేది. నిర్మాణ విలువలు బాగున్నాయి.



## హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ హారర్ మూవీ..

### ఇప్పుడు మరో ఓటీటీలోకి

హారర్ సినిమాలు తీయాలంటే హాలీవుడ్ దర్శకుల తర్వాత ఎవరైనా. ఎందుకంటే చాలా రియలస్టిక్‌గా ఉంటాయి. చూస్తున్నప్పుడు భయపెడతాయి. ఈ ఏడాది అలా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని భయపెట్టిన ఓ సినిమా ఓటీటీలో ఉచితంగా అందుబాటులోకి వచ్చేందుకు రెడీ అయిపోయింది. ఈ మేరకు స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది ఆగస్టులో రిలీజైన హాలీవుడ్ మూవీ 'వెపన్స్'. రూ.335 కోట్ల బడ్జెట్‌తో తీస్తే రూ.2400 కోట్ల వరకు కలెక్షన్స్ వచ్చాయి. విడుదల తర్వాత కొన్ని వారాలకే అమెజాన్ ప్రైమ్, ఆపిల్ టీవీ ప్లస్, వుడు గూగుల్ వీడియోప్లేలోకి వచ్చింది. కాకపోతే అద్దె విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో ఎక్కువమంది చూడలేకపోయారు. ఇప్పుడు కొత్తగా హాట్‌స్టార్‌లోకి రాబోతున్నట్లు ప్రకటించారు. జనవరి 8 నుంచి ఉచితంగా స్ట్రీమింగ్ కానుందని క్లారిటీ ఇచ్చారు. తెలుగులోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం అయితే ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో? 'వెపన్స్' విషయానికొస్తే.. మేబ్రూక్ అనే ఊరిలో ఓ రోజు రాత్రి 2:17 గంటలకు 17 మంది చిన్నారులు వాళ్ల ఇంట్లో నుంచి బయటకెళ్లిపోతారు. ఎంత వెతికినా కనిపించరు. వీళ్లంతా ఒకే స్కూల్ ఒకే క్లాస్‌లో చదువుతుంటారు. ఇదే క్లాస్‌కి చెందిన ఓ పిల్లాడు మాత్రం బాగానే ఉంటాడు. దీంతో ఊరందరి అనుమానం క్లాస్ టీచర్ జస్టిన్(జూలియా గార్నర్)పై పడుతుంది. అసలు ఆ 17 మంది పిల్లలు ఏమయ్యారు? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.



## ధీరే... ధీరే

ధీరే... ధీరే అంటూ పాట అందుకున్నారు విశ్వక్ సేన్, కయాదు లోహర్. ఈ ఇద్దరూ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న 'ఫంకీ' చిత్రంలోని పాట ఇది. సినిమాలో వచ్చే ఈ తొలి పాటను బుధవారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ పాటకు దర్శకుడు కేవీ అనుదీప్ సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, రోహిణి సోరట్ ఆలపించారు. 'జాతి రత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'ఫంకీ' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "ఈ పాటలో విశ్వక్-కయాదుల జోడీ, పాటలోని కొత్తదనం యువతకు చేరువయ్యేలా ఉంటుంది" అని తాజాగా విడుదల చేసిన 'ధీరే... ధీరే' పాట గురించి యూనిట్ పేర్కొంది. విభిన్నమైన కథాంశంతో, ఆద్యంతం అలరించే హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఈ సినిమా ఉంటుందని, 'ఫంకీ' అనేది ప్రేక్షకులకు ఓ మంచి వినోదాల విందు అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## దేవిలాంటి పాత్రలు ఒక్కసారే వస్తాయి

"'శంబాల' ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే ప్రేక్షకులు ఆ ప్రపంచంలోకి వెళ్లారు. ఇలాంటి చిత్రాన్ని థియేటర్లో చూస్తేనే ఆ వైబ్ వస్తుంది. అన్ని రకాల భావోద్వేగాలను టచ్ చేస్తూ తీసిన 'శంబాల' ప్రేక్షకులను అలరిస్తుంది" అని హీరోయిన్ అర్చనా అయ్యర్ చెప్పారు. ఆది సాయికుమార్ హీరోగా యుగంధర్ ముని దర్శకత్వం వహించిన చిత్రం 'శంబాల'. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో అర్చనా అయ్యర్ మాట్లాడుతూ- "నేను తెలుగమ్మాయినే. మాది చిత్తూరు జిల్లా. అయితే ఎడ్యుకేషన్ మొత్తం బెంగళూరులోనే జరిగింది. 'శంబాల'లో నాది కేవలం స్టెప్పులు వేసే పాత్ర కాదని ముందే చెప్పారు. నా కెరీర్ ఆరంభంలోనే 'శంబాల' లాంటి చిత్రం, ఈ చిత్రంలో దేవిలాంటి పాత్ర చేయడం నా లక్‌గా భావిస్తున్నాను. ఇలాంటి పాత్రలు కెరీర్‌లో మళ్లీ మళ్లీ రావు. ఒక్కసారే వస్తాయి. 'శంబాల' ప్రీమియర్లకు మంచి స్పందన



వచ్చింది. చాలా మంది దర్శకులు ఫోన్ చేసి, నన్ను అభినందిస్తున్నారు. ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఓ మూవీ చేస్తున్నాను. పాత్ర డిమాండ్ చేస్తే రొమాంటిక్ సీన్లు చేస్తాను. అలాగే ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని ఉంది" అని చెప్పారు.



## మార్క్ క్వీన్..

### స్టార్ హీరో సినిమాతో కన్నడలో ఎంట్రీ

నటి దీప్‌శిఖ 'మార్క్ మూవీ'తో కన్నడ సినీ పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ నేడు (డిసెంబర్ 25న) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంలో కన్నడ సూపర్‌స్టార్ కిచ్చా సుదీప్‌తో కలిసి స్క్రీన్‌ను పంచుకుంది. ఇది దీప్‌శిఖ సినీ ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. అరంగేట్రానికి ముందే సోషల్ మీడియాలో తన పేరు మారుమోగిపోతోంది. సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, ట్రైలర్‌లో దీప్‌శిఖ తన శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో, ఆత్మవిశ్వాసంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

#### ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నా..

దీంతో అభిమానులు ఆమెకు "మార్క్ క్వీన్" అనే బిరుదును ఇచ్చారు. ఇక దీప్‌శిఖ మాట్లాడుతూ.. కిచ్చా సుదీప్‌తో కలిసి పనిచేయడం వల్ల నా కల నెరవేరింది. ఆయన దగ్గరి నుంచి క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం నేర్చుకున్నాను. ఇవి నా నటనను మరింత మెరుగుపర్చేందుకు ప్రోత్సహించాయి. అలాగే ప్రతిష్టాత్మక సత్యజ్యోతి ఫిలింస్ బ్యానర్‌లో పనిచేసినందుకు సంతోషంగా ఉంది.

#### ఎంతో ప్రేమ

ఇలాంటి గొప్ప నిర్మాణ సంస్థతోనే నా కన్నడ ప్రయాణం ప్రారంభం కావడం నా కెరీర్‌కు మరింత విలువ, ధైర్యాన్ని ఇచ్చింది. ఈ అవకాశం లభించడం నా అదృష్టం. సినిమా విడుదలకంటే ముందే నాపై ఎంతో ప్రేమ చూపించారు. మీ ప్రేమే నన్ను మరింత ముందుకు వెళ్లేలా చేస్తుంది అని పేర్కొంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, సిబ్బంది, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com